ప్రజాశక్తి
సోమవారం 29 డిసెంబర్ 2025
12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రెండో రోజూ శ్రామికోత్సాహం

★ అలరించిన సాంస్కృతిక, కళా, నృత్య ప్రదర్శనలు
★ ఆకట్టుకున్న సైన్స్, కార్టూన్ ఎగ్జిబిషన్‌లు, షార్ట్ ఫిలిం షోలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఐటియు 18 అఖిల భారత మహాసభలు సందర్భంగా నిర్వహిస్తున్న శ్రామక ఉత్సవ్‌లో భాగంగా రెండో రోజు ఆదివారం విశాఖ సాగర తీరం ఏయూ కన్వెన్సన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వీక్షకుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. అత్యధిక సంఖ్యలో ఇక్కడి ఎగ్జిబిషన్ స్టాల్స్ వద్ద ప్రజలు గుమిగూడి తిలకించారు. ప్రజానాట్య మండలి కళాకారుల బృంద గానాలు, కళాకారుల సోలో పాటలు ఆద్యంతం వీక్షకులందరినీ ఉర్రూతలూగించాయి. చిన్న పిల్లలు సైతం 'శ్రామిక ఉత్సవ్' వేదికపై జరిగిన డాన్సులకు హావభావాలతో ఆనందిస్తూ కేరింతలు కొట్టడం, కోలాటం కర్రలతో నృత్యం చేయడం అందరినీ కట్టిపడేశాయి.

ఈనెల 31 నుంచి జనవరి 4

మిగతా 2లో..

కళా రూపం ప్రదర్శిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

రాష్ట్రంలో కార్మిక శక్తికి విశాఖే కేంద్రం

◆ సమస్య ఏదైనా సానుకూలంగా స్పందిస్తాం
◆ కార్మిక కష్టాలు తీర్చడంలో సిఐటియు ప్రత్యేక కృషి
◆ శ్రామిక ఉత్సవ్‌లో వివిఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు అత్యధికంగా గల కేంద్రం విశాఖ అని, ఇది కార్మిక శక్తికి కేంద్రమని విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్ అన్నారు. 'కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి అనే థీమ్‌తో విశాఖ ఏయూ కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం రెండోరోజు శ్రామిక ఉత్సవ్ సభ ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన తేజ్ భరత్ మాట్లాడుతూ కార్మికుల కష్టాలు తీర్చడంలో సీఐటీయూ ప్రత్యేక కృషి చేస్తుందని కొనియాడారు. ఇక్కడ కార్మిక సమస్యలు, ఇంకా ఏమైనా అభివృద్ధికి సంబందించిన సమస్యలపై తాము సానుకూలంగా స్పందిస్తామని కమిషనర్ తెలిపారు. విశాఖకు రాబోతున్న రూ.వందలకోట్ల పెట్టుబడులతో ప్రభుత్వం అనేక రోడ్లు అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుడుతుందన్నారు. వైజాగ్ సిటీని అడ్వంచెర్ హాబ్‌గా మార్చే కృషి చేస్తున్నామని చెప్పారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజల కోసం విఎంఆర్‌డిఎ ఇళ్ల నిర్మాణానికి ప్లాన్ చేస్తుందన్నారు. వైజాగ్‌లో 50 మురికి వాడాలున్నాయని, వీటి రీ డెవలప్మెంట్ కోసం ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

మాట్లాడుతున్న తేజ్ భరత్, చిత్రంలో నర్సింగరావు, నాగేశ్వరరావు తదితరులు

కార్మికు హక్కులపై నానాటికీ దాడులు : గఫూర్

దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మిక హక్కులపైనా, కార్మికులపైనా నానాటికీ ప్రభుత్వాలు దాడులు చేస్తున్నాయని పోరాడి సాధించుకున్న చట్టాలను 4 లేబర్ కోడ్‌లతో ధ్వంసం చెయ్యాలని చూసే చర్యలపై నిరంతరం పోరాడాలని సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ పిలుపునిచ్చారు. 'శ్రామిక ఉత్సవ్' రెండోరోజు 'కార్మిక, కర్షక ఐక్యతే లక్ష్యం' అనే

మిగతా 2లో..

నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాలను నియంత్రించాలి

▶ వార్త 2లో..

కెజిహెచ్‌లో విద్యుత్ కోతలు నివారణకు చర్యలు

▶ వార్త 2లో..

సిపిఎం నేత అప్పలరాజు అరెస్టుపై రాజయ్యపేటలో మత్స్యకారుల నిరసన

▶ వార్త 11లో..

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిహారిక

ఫరెవర్ మిస్ ఇండియాగా నిహారిక

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : రాజస్థాన్‌లోని జైపూర్‌లో గల జీ స్టూడియోస్‌లో నిర్వహించిన ఫరెవర్ స్టార్ ఇండియా అవార్డ్స్ గ్రాండ్ ఫినాలేలో నీహారిక బెతనపల్లి 'ఫరెవర్ మిస్ ఇండియా 2025' విజేతగా నిలిచారు. ఫరెవర్ స్టార్ ఇండియా సిఈఓ రాజేష్ అగర్వాల్, డైరెక్టర్ జయ చౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఆమె ఈ ప్రతిష్టాత్మక కిరీటాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తానూ విశాఖపట్నంలో పుట్టి పెరిగానని, బి.టెక్ పూర్తి చేసి, గత మూడేళ్లుగా బెంగళూరులోని ఒక టెక్నికల్ సంస్థలో పనిచేస్తున్నానని తెలిపారు. జాతీయ స్థాయి కిరీటాన్ని గెలవడానికి ముందు 'మిస్ బెంగుళూరు' టైటిల్‌ను కూడా సాధించినట్లు చెప్పారు. ఈ జాతీయ

మిగతా 2లో..

నేటి బంద్‌కు సమాయత్తం

- ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో విస్తృత ప్రచారం
- స్వచ్ఛందంగా పాల్గొంటామంటున్న ప్రజలు
- బెదిరింపులకు పాల్పడుతున్న పోలీసులు, కూటమి నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజుపై పీడీ యాక్టు ప్రయోగించి అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడాన్ని నిరసిస్తూ సిపిఎం, వామపక్ష పార్టీలు సోమవారం

మిగతా 2లో..

ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజల హక్కులను కాలరాస్తున్నారు

పోలీసులు రూల్ 30 అమల్లో ఉందని ప్రజలను బంద్‌లో పాల్గొనకుండా బెదిరింపు చర్యలు చేపడుతూ ప్రజల హక్కులను కాల రాస్తున్నారు. సిపిఎం చట్టాలను ఎప్పుడూ ఉల్లంఘించలేదు. ప్రజా సమస్యలపై చట్టానికి లోబడి అప్పలరాజు పోరాటం చేశారే తప్ప, చట్టాలను ఎప్పుడూ ఉల్లంఘించలేదు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఏ నాయకుడిపైనా, ఎప్పుడూ పీడీ యాక్ట్ పెట్టలేదు. అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి, అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం. అప్రజాస్వామ్య చర్య. సోమవారం నాటి బంద్‌లో ప్రజలు పాల్గొనకుండా పోలీసులు, కూటమి నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నప్పటికీ, ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలు, షాపుల యాజమాన్యం, ఆటో, ముఠా కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులందరూ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలి.

- కె.లోకనాథం, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు

మొదటి పేజీ తరువాయి..

రెండో రోజూ 'శ్రామికోత్సాహం'

వరకూ ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న సిఐటియూ ఆలిండియా 18వ మహాసభల సందర్భంగా శనివారం (27న) ప్రారంభమైన 'శ్రామిక ఉత్సవ్' రెండో రోజు 'ఆనందమానంద మాయె' అన్నట్టుగా సాగింది. జానపద కళా నృత్యాలు, గిరిజన డప్పులు, డాన్సులు, వేమన పద్యాలతో కళారూపాలు అన్నీ అలరించాయి. ఆదివారం శ్రామిక్ ఉత్సవ్‌లో ప్రధాన ఆకర్షణగా కవులు, రచయితల కవితల పఠనం, సమ్మేళనం సభ ఆద్యంతం విజ్ఞాన దాయకంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాహితీ స్రవంతి నిర్వహణలో సాగిన 'శ్రామిక కవనం'లో 100 మంది వరకూ కవులు పాల్గొని వివిధమైన సమస్యలపై కవితాగానం చేశారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సుమారు 15 వేల రకాల, 100 మంది రచయితలు రాసిన లక్ష వరకూ పుస్తకాల వద్దకు పెద్ద సంఖ్యలో జనం విచ్చేసి తిలకించారు. పలువురు తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు.

రాష్ట్రంలో కార్మిక శక్తికి విశాఖే కేంద్రం

థీమ్ (స్పిరిట్ ఆఫ్ వర్కింగ్ క్లాస్)తో జరుగుతున్న సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వావలంబనను నిలబెట్టేందుకు సిఐటియూ 1970 నుంచి కృషి చేస్తుందని చెప్పారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న జాతీయ మహాసభల్లో ఈ అంశంపై సిఐటియూ ప్రతినిధులు చర్చించనున్నారన్నారు. రైతు సంఘం ఆలిండియా నాయకులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గానికి సంకెళ్లు వేసే లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తెచ్చిందని, దేశానికి తిండిపెట్టే రైతన్నలను హింసలకు గురిచేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఇలాంటి విధానాలను తిప్పికొట్టాలని ఢిల్లీ, పంజాబ్, హర్యానా రైతుల ఆందోళనలు మోడీ మెడలు వంచిన తీరును వివరించారు. కేంద్రం కోటి ఎకరాలు, ఏపి ప్రభుత్వం 14లక్షల ఎకరాల సాగుభూమిని సేకరించాలనే లక్ష్యంతో గ్రామాల్లో భూములను లాక్కొని గ్రామ సంస్కృతిని దెబ్బతీసే చర్యలకు దిగడాన్ని ఎదిరించాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా నాయకులు పి.మణి మాట్లాడుతూ ప్రభుత్వ రంగానికి నిలయమైన విశాఖలో ఆ పరిశ్రమలు లేకుండా, పేదలకు హక్కుగా ఉండే భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. కార్మిక రాజ్యం కోసం సిఐటియూ నిరంతరం పనిచేస్తుందని, ఇలా పోరాడడం ద్వారానే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు అల్లూరి నరసింహరాజు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎ ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేటి బంద్‌కు సమాయత్తం

తలపెట్టిన ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల బంద్‌ను జయప్రదం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు సమయాత్తమవుతున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టి హత్యాయత్నం, అక్రమ సమూహం, అక్రమ ప్రవేశం వంటి కేసులు నమోదు చేశారు. వాస్తవానికి అప్పలరాజు తన జీవితకాలంలో అత్యధిక భాగం ప్రజల సమస్యల పరిష్కారానికే పోరాటం చేశారు. భూములు కోల్పోతున్న పేద రైతులు, అందునా అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారి కోసం, వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదారుల ప్రయోజనాలను కాపాడడానికి అప్పలరాజు శాంతియుతంగా ఉద్యమించారు. పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చే రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్కునకు వ్యతిరేకంగా ప్రజలు, మత్స్యకారులతో కలిసి అప్పలరాజు గళమెత్తారు. దీన్ని ఓర్వలేకనే పీడీ యాక్ట్‌ను ప్రభుత్వం ప్రయోగించింది. అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పీడీ యాక్ట్‌ను ఉపసంహరించి, అతన్ని విడుదల చేయాలని కోరుతూ ఈనెల 29వ తేదీ సోమవారం నాడు బంద్‌కు సిపిఎం, వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం సిపిఎం నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే పోలీసులు, కూటమి పార్టీల నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. రూల్ 30 అమల్లో ఉందని బంద్‌లో పాల్గొనవద్దని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. అయినా కూడా ప్రజలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

ఫరెవర్ మిస్ ఇండియాగా నిహారిక

స్థాయి పోటీ కోసం దేశవ్యాప్తంగా సుమారు 10,000 నామినేషన్లు రాగా, ఫినాలేకు 105 మంది ఎంపికైనట్లు తెలిపారు. అందం అంటే కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, ఆత్మవిశ్వాసం, సానుభూతి సమాజం పట్ల అవగాహన కలిగి ఉండటమే నిజమైన అందమని ఈ సందర్భంగా నీహారిక పేర్కొన్నారు. అంతేకాకుండా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతంలో తొమ్మిదేళ్లకు పైగా శిక్షణ పొందానని, 2008, 2011 సంవత్సరాల్లో జరిగిన మహా బృంద నాట్యం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూచిపూడి ప్రదర్శనల్లో పాల్గొన్నానని తెలిపారు. అథ్లెటిక్స్‌లో షాట్ పుట్, హైజంప్ డిస్కస్ త్రో విభాగాల్లో బంగారు పతకాలు చెప్పారు.

నూతన సంవత్సరం సందర్భంగా

మద్యం అమ్మకాలను నియంత్రించాలి

- బార్లు, క్లబ్‌లు, పబ్బులపై పోలీసులు నిఘా పెట్టాలి
- ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవి, సత్యవతి

సమావేశంలో పాల్గొన్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 30 నుంచి జనవరి 1వ తేదీ వరకు మద్యం అమ్మకాలు రాత్రి 7 గంటల వరకే జరిగేలా నిర్ణయం తీసుకోవాలని, మద్యం అమ్మకాలను నియంత్రించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులను ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి డిమాండ్ చేశారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఐద్వా జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 31, జనవరి 1 తేదీలలో మద్యం దుకాణాలు తెల్లవార్లు తీసి ఉంచడం వల్ల యువత మద్యం అధికంగా సేవించి రోడ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, ప్రజలకు ముఖ్యంగా మహిళలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తుండటం, రోడ్లపై ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. యువత తాగిన మైకంలో దాడులు, గొడవలకు పాల్పడటం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, అఘాయిత్యాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతుందని, అడుగడుక్కి బార్లకు లైసెన్సులు ఇచ్చారని తెలిపారు.

ప్రభుత్వం అండతో మద్యం షాపుల యజమానులు ఏమాత్రం నిబంధనలు పాటించకుండా, రోజుకి 24 గంటలు విచ్చల విడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. మద్యాన్ని నిషేధించాలని మహిళలు పోరాడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ఆరోపించారు. కాలేజీలు, స్కూల్స్, హాస్టల్స్‌ను టార్గెట్ చేసుకుని మత్తు పదార్థాలు అమ్మకాలు సాగిస్తుండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని విమర్శించారు. విశాఖ నగరానికి నూతన సంవత్సరం సందర్భంగా టూరిస్టులు కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు కనుక డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీలలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని, మద్యం షాపుల సమయాలను సవరించి రాత్రి 7 గంటల తర్వాత మద్యం విక్రయాలు నిలిపివేయాలని కోరారు. క్లబ్బులు పబ్బులు, బార్లపై పోలీసుల నియంత్రణ ఉండాలని, ఎక్కడికక్కడ పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా నాయకురాలు బి.పద్మ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో విద్యుత్ కోతలు నివారణకు చర్యలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్)లో విద్యుత్ కోతల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఈ క్రమంలోనే తాజాగా 323 కెవి మొబైల్ జనరేటర్‌ను (ట్రాలీ జనరేటర్) అందుబాటులోనికి తీసుకొస్తున్నామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. తన ఛాంబర్‌లో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రెండు నెలల క్రితం కెజిహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ వద్ద చేపడుతున్న అభివృద్ధి పనుల సమయంలో పైపులైన్ పగిలి విద్యుత్ కోత నిలిచిపోయిన కారణంగా రోగులు ఇబ్బంది పడ్డారని, ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రాజేంద్రప్రసాద్, భావనగర్ వార్డులకు నూతన జనరేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే సిఎస్ఆర్ బ్లాక్‌లో సోలార్ ద్వారా విద్యుత్ అందుతుండగా, కెజిహెచ్‌లో మొత్తం 10 జనరేటర్లు ఉన్నాయని చెప్పారు. ఇవే కాకుండా 323 కెవి సామర్థ్యం గల 3 మొబైల్ జనరేటర్ల (ట్రాలీ జనరేటర్) బ్యాక్ అప్ కోసం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటి ద్వారా ఐసియుల్లో రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. త్వరలోనే పలు వార్డుల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేశామన్నారు. కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ మాట్లాడుతూ ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటి సమస్యలప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఇంటర్మీడియట్ ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఇంటర్మీడియట్ ఉద్యోగుల సేవా సంఘం విశాఖ జిల్లా 2026 కేలెండరును ఆదివారం పిఠాపురం కాలనీ ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి సుధాకర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉద్యోగులు నైపుణ్యంతో బలోపేతం కావాలని సూచించారు. కళాశాలల్లో కార్యాలయపు పని తీరును మెరుగుపరచాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు జివి.అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఖాళీగా వున్న జిల్లా పర్యవేక్షకులు పోస్టుల భర్తీ, పదోన్నతులపై ఇంటర్మీడియట్ విద్యా శాఖ సంచాలకులు కృషి చేస్తున్నారని, ఈ విషయంపై రాష్ట్ర సంఘం కూడా ఉద్యోగులకు అండగా ఉంటుందని చెప్పారు. జిల్లాల్లోని కళాశాలల్లో పదోన్నతులపై భర్తీ చేయాల్సిన పోస్టులపై రాష్ట్ర సంఘం ఉన్నతాధికారుల దృష్టిలో తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగులు ఒమ్మి రాము, గుమ్మడి మణికంఠ గణేష్‌కు ఉద్యోగులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎన్.ఈశ్వరమ్మ, జోనల్ కార్యదర్శి ఎన్.మురళీమోహన్, జిల్లా సహాధ్యక్షులు బంకపల్లి రామారావు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు మండం విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రీడల అభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : నగరంలో క్రీడల అభివృద్ధికి, యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను నిరంతరం ముందు ఉంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో వంగవీటి రంగా మెమరియల్ కిక్ బాక్సింగ్, ర్యాంబో సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో ఇటువంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర మరువలేనిది

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర మరువలేనిదని డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ రాజు) తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ జెండాను హాసిని వర్మ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ వల్లేనని తెలిపారు. బ్రిటిష్ వారి పాలనలో మగ్గిపోతున్న తరుణంలో దేశ స్వాతంత్ర్యం కోసం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పుట్టిందని తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ భారత ప్రధానులుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, గ్రామాలలోని ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. 12 సంవత్సరాలుగా బిజెపి దేశంలో కులాలు, మతాల ప్రాతిపదికన పాలన సాగిస్తుందన్నారు. పేదల ఉపాధి కోసం ప్రారంభించిన ఉపాధి హామీ చట్టానికి మహాత్మా గాంధీ పేరును బిజెపి ప్రభుత్వం తొలగించి, ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పోరాటాలు కొనసాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తుల శ్రీనివాస్, రాష్ట్ర స్పోర్ట్ సెల్ చైర్మన్ కమలాకర్, సేవాదళ్ నాయకులు, నియోజక వర్గ ఇన్‌చార్జి లు,ప్రధాన కార్యదర్శులు,వార్డు ప్రెసిడెంట్లు ఎస్సీ సెల్ మైనారిటీ సెల్ నాయకులు,మహిళ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ : కలెక్టర్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలు పరిస్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇకనుండి రెవెన్యూకు సంబంధించిన అర్జీలు విషయమై 'రెవిన్యూ క్లినిక్'ను కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఒక్కరోజు మాత్రమే కాకుండా, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ఉంటుందన్నారు. సదరు కార్యక్రమానికి జిల్లాలోని అందరు రెవిన్యూ డివిజినల్ అధికారులు, తహసీల్దారులు పాల్గొంటారని, కావున అర్జీదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఆదివారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలు, భద్రత, పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. బుకింగ్ కౌంటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, క్యాటరింగ్ స్టాళ్లు, ప్లాట్‌ఫారమ్‌లపై భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సిసిటివి మానిటరింగ్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ప్రయాణికుల రద్దీపై సమీక్షలో భాగంగా విశాఖపట్నం -కిరండూల్ మార్గంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని గమనించిన డీఆర్ఎం, తక్షణమే అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైలు నెంబర్ 58501 విశాఖ – కిరండూల్ రైలుకు డిసెంబర్ 29 నుండి జనవరి 20వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబర్ 30 నుండి జనవరి 21 వరకు ఒక అదనపు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను జోడించాలని ఆదేశించారు. పండగ, పర్యాటక సీజన్ దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. డీఆర్ఎం వెంట ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) కె.రామారావు, ఉన్నతాధికారులు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డిఆర్ఎం లలిత్ బోహ్రా

గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నృత్య ప్రదర్శనలిస్తున్న గీతం పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-మధురవాడ : 'హోమ్ కమింగ్' పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఏటా నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం రెండు రోజులపాటు గీతం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాలలో ఉంటున్న గీతం పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సమ్మేళనంలో భాగంగా విద్యార్థులు సాంకేతిక ఉత్సవాల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గీతం పూర్వ విద్యార్థుల రాకతో ఇంజినీరింగ్, ఫార్మసీ, సైన్స్, మేనేజ్‌మెంట్, దంత వైద్య విభాగాలలో అధ్యాపకులతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహ హాజరు కావడంతో గీతం ప్రాంగణంలో వినోదాన్ని పంచే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో గీతం ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హజరైన గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎమ్.శ్రీభరత్ గీతం ప్రగతిని, భవిష్య ప్రణాళికలను వివరించారు. గీతం విశ్వవిద్యాలయాన్ని ప్రపంచ శ్రేణి విద్యా సంస్థగా తీర్చిదిద్దడానికి బోధనతో పాటు పరిశోధనలపై ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు. కాలానుగుణంగా కోర్సులను మార్పుచేయడంతో పాటు అధ్యాపకులకు నిరంతర శిక్షణ కార్యక్రమాలతో బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన విభాగాలను ఏర్పాటు చేయడం, విద్యార్థులకు అవకాశాలు పెరిగేలా శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడించారు. పూర్వ విద్యార్థులు గీతం ప్రగతిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ, కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుత కాలంలో విద్యారంగాన్ని సైతం ప్రభావితం చేస్తోందని, అందుకు తగిన విధంగా నూతన విద్యావిధానాన్ని అనుసరిస్తూ గీతం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. గీతం ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం స్టూడెంట్ లైఫ్ సహాయ డీన్ అరుణ్‌కార్తిక్, గీతం పూర్వవిద్యార్థుల సంబంధాల విభాగం డిప్యూటీ డైరక్టర్ పి.నవీన్, వివిధ కళాశాలల డీన్‌లు పాల్గొన్నారు.

ఈ ఏడాది పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రముఖ సంస్థలలో ప్రతిభను చాటుతూ కీలక స్థానాలకు ఎదిగిన పలువురు గీతం పూర్వ విద్యార్థులను అవార్డులతో సన్మానించారు. పారిశ్రామికవేత్తగా ఎదిగిన గీతం పూర్వవిద్యార్థి డిజివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు రాఘవన్ వెంకటేషన్, నారికేర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కనుమూరి గాయత్రి, ప్రముఖ ఐటి సంస్థ (టిసిఎస్) యూరప్ వ్యవహారాల అధిపతి సి.సప్తగిరి, వివిఎఫ్‌ఎక్స్ నిపుణుడుగా పలు జాతీయ చలన చిత్రాలకు పనిచేసిన జయకర్ ఆరుద్రలకు విశిష్ట పురస్కారాలను అందజేశారు. గీతంలో విద్యాభ్యాసం తాము ఉన్నత స్థానాలకు చేరడానికి ఎంతో దోహద పడిందని వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా గీతం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ విశాఖ శాఖ నూతన సభ్యులను శ్రీభరత్ అభినందించారు. ఈ హోమ్‌కమింగ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ తొట్టిపై కాలిపోతున్న వరి చేను

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వరిచేను దగ్ధం

ప్రజాశక్తి- వద్దాది : వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో ట్రాక్టర్‌పై తీసుకొస్తున్న వరిచేను దగ్ధమైన ఘటన ఆదివారం బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే వడ్డాది గ్రామానికి చెందిన బొబ్బిలి రాజు అనే రైతు సాయిబాబా గుడి ఎదురుగా పంటపొలాల్లో నుండి వరి చేనును ట్రాక్టర్‌పై కట్టి పాక వద్దకు తీసుకువస్తుండగా, పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ట్రాక్టర్ తొట్టితో సహ వరి పనలు కాలిబూడిదయ్యాయి. దీంతో బాధిత రైతుల లబోదిబోమంటున్నాడు. కష్టపడి పం డించిన పంట ఇలా అగ్నికి ఆహుతి కావడం, దీంతోపాటు ట్రాక్టర్ తొట్టి కూడా కాలిపోవడంతో దిగులు చెందుతున్నాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నాడు.

నేలబావిలో పడి పశు వైద్యుడు మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నేలబావిలో పడి పశువుల వైద్యుడు మృతి చెందిన సంఘటన అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం కె.సంతపాలెం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జిల్లాలోని రావికమతం మండలం గొంప గ్రామానికి చెందిన పీలా కొండలరావు (32) విశాఖ డెయిరీలో పశువుల డాక్టర్‌గా పని చేస్తున్నాడు. కె.కోటపాడులో భార్య పిల్లలతో నివాసముంటూ ఈ మండలంలో విశాఖ డెయిరీ పంపిణీ చేసిన ఆవులు, గేదెలకు చికిత్సలు అందిస్తూ ఉంటాడు. శనివారం రాత్రి విధులు ముగించుకొని మండలంలోని కె.సంతపాలెం దగ్గర్లో బహిర్భూమికి వెళ్లి నేల బావిలో కడుకుంటూ జారి పడిపోయాడు. రాత్రికి భర్త ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య నిరోష కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో ఆదివారం ఉదయం కొండలరావు సోదరుడు అప్పలనాయుడు వెతికే క్రమంలో కె.సంతపాలెం దగ్గరలో మోటార్ సైకిల్ గుర్తించాడు. పక్కనే ఉన్న నేలబావిలో పరిశీలించగా అందులో కొండలరావు మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు అప్పలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రమాదవశాత్తు జరిగిందే తప్ప తన సోదరుడు మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ఎస్ఐ ధనుంజయ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కె కోటపాడు సిహెచ్‌సిక తరలించారు . కాగా మృతునికి భార్యతో పాటు జోషిత్ నాయుడు, మోక్షిత అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సుధాకర్

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 36వ వార్డు పరిధి ఎవిఎన్.కాలేజీ సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, 36వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి కేతారి లక్ష్మి ఆధ్వర్యంలో ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ముందుగా సీతంరాజు సుధాకర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై సద్వినియోగం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బిపి, సుగర్, 2డి ఎకో వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, టిడిపి నాయకులు,పాల్గొన్నారు.

అమలులో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : నర్సీపట్నం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసు అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు చేయడం, వాటిలో పాల్గొనడం చట్టరీత్యా నేరమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నక్కపల్లి సిఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. నక్కపల్లి సర్కిల్ పరిధిలోని ఎస్ రాయవరం, అడ్డురోడ్డు, కోటవురట్ల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ధర్నాలు, నిరసనలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలు గమనించాలని సూచించారు

రైతు కుటుంబం నుంచి పోలీస్ అధికారిగా...

తోమురోతు వెంకటేష్

ప్రజాశక్తి - ఆనందపురం : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఐ నియామక ఫలితాల్లో ఆనందపురం మండలం వేమగొట్టిపాలెం గ్రామానికి చెందిన తోమురోతు వెంకటేష్ జోన్-1లో 4వ ర్యాంకు సాధించారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఆయనను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సబ్ డివిజన్ పరిధిలోని పెదబయలు పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ)గా నియమించగా, ఇటీవల అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మారుమూల గ్రామంలోని ఒక రైతు కుటుంబంలో జన్మించిన వెంకటేష్ గిడిజాల ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం స్థానిక మహోదయ కళాశాలలో ఇంటర్మీడియట్, గాయత్రి కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎస్ఐగా ఎంపిక కావాలనే లక్ష్యంతో కాకినాడలోని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్లో నాలుగేళ్లపాటు సాధన చేశారు. చివరికి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ విజయానికి తన తల్లిదండ్రులు తోమురోతు రామానాయుడు, లక్ష్మి ప్రోత్సాహం ఎంతో దోహదపడిందని వెంకటేష్ తెలిపారు. అన్నదమ్ములు అప్పలనాయుడు, పాపునాయుడు సహకారం మరువలేనిదని, కుటుంబ సభ్యులు, స్నేహితులు తన ప్రయాణంలో అండగా నిలిచారని పేర్కొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత అందిస్తున్న చిన్ననాటి స్నేహితులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 2వ వార్డు పరిధిలో తమతో చదువుకున్న చిన్ననాటి మిత్రుని కుటుంబానికి స్నేహితులు ఆర్థిక చేయూత అందించారు. బాలాజీనగర్‌కు చెందిన తమ్మిన శ్రీను ఇటీవల గోస్తనీ నదిలో జారిపడి మృతి చెందడంతో ఇంటి పెద్దదిక్కు కోల్పోయి భార్య ఇద్దరు పిల్లలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న అతని చిన్ననాటి మిత్రులు సేకరించిన రూ.22 వేలు, నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా మిత్రుడు వాండ్రసి సతీష్ మాట్లాడుతూ, ఈ కుటుంబానికి స్నేహితులమంతా అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిత్రులు బండారు విద్యాసాగర్, శీరపు రమేష్, జగ్గుపిల్లి నర్సింగ్, నానాజీ, మైథిలి, గంగాధర్, శ్రీను, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సప్త శక్తి సంగమం

ప్రజాశక్తి -ఆనందపురం : గుడిలోవలోని విజ్ఞాన విహార రెసిడెన్షియల్ స్కూల్లో ఆదివారం విద్యార్థుల తల్లుల భాగస్వామ్యంతో సప్త శక్తి సంగమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రజని సర్వాటే అధ్యక్షత వహించగా, డాక్టర్ బి.ధరణీప్రియ, యు.శేషులత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ అభివృద్ధిలో మహిళల కీలక పాత్రను డాక్టర్ బి.ధరణీప్రియ వివరించారు. యు.శేషులత కుటుంబ ప్రబోధన, కుటుంబ బంధాల పరిరక్షణతో పాటు పర్యావరణ సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లు, వాటికి సాధ్యమైన పరిష్కారాలపై అవగాహన కల్పించారు. కుటుంబం, సమాజానికి విశేష సేవలందించినందుకు బోజా రవణమ్మను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు పాటలు పాడుతూ, క్విజ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు రాణి దుర్గావతి, గార్గి, కన్నగి పాత్రలతో పాటలు, ప్రాతాభినయాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ఏపి ఎన్‌జిఒ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏపి ఎన్‌జిఒ సంఘం భీమిలి తాలూకా యూనిట్ ఎన్నికలు ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించారు. అధ్యక్షులుగా కెవిఎన్.నారాయణరావు, అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్.ఈశ్వరరావు, కార్యదర్శిగా కె.సాయిబాబా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.ప్రసాద్, కోశాధికారిగా పి.వరహామూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కార్యదర్శి సాయి బాబా తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, డిప్యూటీ ఎండిఒ రమేష్ నాయుడు, ఏపి ఎన్‌జిఒ సంఘం భీమిలి తాలూకా యూనిట్ పూర్వ అధ్యక్షులు కె.ముత్యాలరావు తదితరులు అభినందించారు. ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అప్పలరాజు, సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా కోశాధికారి సుబ్రమణ్యం వ్యవహరించారని సాయిబాబా తెలిపారు

దుర్గాదేవి వర్తక సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక దుర్గాదేవి వర్తక సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గౌతు లచ్చన్న, దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ కేలండర్‌ను రూపొందించడం సంతోషదాయకమన్నారు. గౌడ సంఘంలో ఎవరికి ఏ సహాయం కావాలన్నా గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రెసిడెంట్ మట్టపర్తి నాగరాజు, దొమ్మేట అప్పారావు, కుడిపూడి రాధాకృష్ణ, కూడిపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరరావు, సేలం శ్రీనివాస్, బంకు ప్రతినిధి రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పిఎం.పాలెంలో వైసిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎంపాలెం శంభువానిపాలెంలో ఆదివారం వైసిపి ఆత్మీయ సమావేశం ఉత్సాహంగా నిర్వహించారు. వార్డు వైసిపి అధ్యక్షులు పోతిన ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలు ఐక్యతతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సమస్యలను కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోతిన హనుమంతరావు, గుడ్ల పోలిరెడ్డి, రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పికొండలో జిప్సా కరస్పాండెంట్ల పిక్నిక్

ప్రజాశక్తి గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో అప్పికొండలో ఆదివారం పిక్నిక్ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు సేద తీరుట కోసం ఈ పిక్నిక్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ముందుగా సర్వ సభ్య సమావేశం ఏర్పాటుచేసి సంఘ పటిష్టత కోసం పలు అంశాలపై చర్చించారు. అనంతరం బీచ్‌లో సభ్యులకు ఆటలపోటీలు నిర్వహించారు. సభ్యులందరూ పాటలు, డాన్సులతో ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిప్సా గౌరవాధ్యక్షుడు పి.భాస్కరరావు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబూరావు, అడ్వైజర్స్ పి.మురళీసుందర్, జి.జగన్, కార్యవర్గ సభ్యులు రాము, ఆనందరావు, సత్యనారాయణ, సుమారు 100 మంది వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

పిక్నిక్‌లో పాల్గొన్న జిప్సా కరస్పాండెంట్లు

వెల్లివిరిసిన సాహితీ సౌరభం

- ఉత్తేజంగా సాగిన శ్రమకవనం
- వందలాదిగా తరలివచ్చిన కవులు, కళాకారులు, గాయకులు
- శ్రామిక సమస్యలు, శాస్త్రీయ విజ్ఞానంపై గళం
- తెలుగుదనం, స్థానికత ఉట్టిపడేలా యాస, ప్రాసలు
- నాన్‌స్టాప్‌గా సాగిన కవితలు, గేయాలు

గంటేడ గౌరునాయుడుకు శ్రమ అవార్డు అందిస్తున్న సిహెచ్.నర్సింగరావు, చిత్రంలో తెలకపల్లి రవి, ఎంవిఎస్.శర్మ తదితరులు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

శ్రమ కవనంలో గళం వినిపించేందుకు, పదం పాడేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కవులు, గాయకులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులతో ఆదివారం శ్రామిక ఉత్సవ్ సాహిత్య వేదిక సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తాము రాసిన కవితలు, కథలు, నవలలపై స్పందనలు, జరుగుతున్న చర్చలు, అంతకు మించి మారుతున్న పరిస్థితులు, పాళీకి పదునుపెట్టాల్సిన స్థితిగతులపై చర్చించుకున్నారు. అనంతరం ప్రారంభమైన శ్రమ కవనంలో పాల్గొని కవితలు, గేయాలు వినిపించారు. 'సిరా సుక్కలతో రాసేది చరిత్ర కాదు... మా కండరాల కష్టం చిందించిన చెమట చుక్కలే మా సంతకం. అరచేతి పగుళ్ల సంచుల్లోంచి పుట్టించిన అక్షరాలే మా హక్కుల సాక్ష్యం' అంటూ కార్మికుల కష్టనష్టాలు, వాటికోసం శ్రమజీవులు చేసే పోరాటాలే చరిత్రను సృష్టిస్తాయంటూ కార్మికుల శ్రమ, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అందులో నుంచి పోరాటాల్లోకి దిగిన తీరును వర్ణించాడు కర్నూలుకు చెందిన కవి పిల్లా కుమారస్వామి. 'అప్పన్న తనామనా అందరికీ దండాలన్నా... అదాని గూగులుకి అప్పనంగా భూములన్నా!?, పంచ గ్రామాలోళ్లు పట్టాలడిగితే ఏళ్లు గడిచినాగానీ ఏలినోళ్లు తేల్చరు.. అడిగిందే తడువుగా అడుగులకు మడుగులొత్తుతూ అదానీకి రాసిచ్చేస్తారు కొండలు' అంటూ సహజ వనరులను కార్పొరేట్లకు ప్రభుత్వం కట్టబెట్టే తీరుపై ప్రముఖ కవి, గాయకుడు నల్లి ధర్మారావు ఆలపించిన పాట సభికులను కట్టిపడేసింది. పరవాడ ప్రాంతాన్ని పరాయివాళ్లకు అప్పగించడం, ఆనందపురాన్ని దాటి మరీ భూములు అమ్మేసుకోవడం, అనకాపల్లి వరకు అడవులు, కొండల కోసం ఎగబాకురుతుండడం వంటి తీరును ఈ గేయంలో కళ్లకుకట్టినట్టుగా చెప్పారు. ఇంత జరుగుతున్నా 'సింహాద్రప్పన్న కన్ను తెరవలేదు, కనకమాలచ్చుమ్మ కన్ను తెరవలేదు, కౌలాసరిగి మీద శివతాండవం ఆడలేదు, రుషికొండపై మునులు పెదవి విప్పలేదు' అంటూ చమత్కరించారు. ఇలా ఒకరు ఇద్దరు కాదు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా కదిలివచ్చిన కవులు, గాయకులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గమ గళం విప్పారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి ప్రారంభించారు. ఈ సభలో ఆలపించిన కవితలు, గేయాలు సభికులను కట్టిపడేశాయి. ఎంతో చైతన్యపర్చాయి. ముఖ్యంగా నేటి సమాజంలో శ్రమజీవుల పాత్ర, వారిపై పాలకులు చూపుతున్న నిర్లక్ష్యం, శ్రమదోపిడీ, నిర్బంధాలు, బెదిరింపులు, బుకాయింపులను ఎత్తిచూపుతూ శ్రామికవర్గం తరపున ఆలపించిన కవితలు, గేయాలు ఎంతో ఆలోచింపజేశాయి. వాటిలో మచ్చుకు మరికొన్ని....

'అప్పల్సామీ... అప్పల్సామీ... ఎప్పుడెళ్లిపోనాడో ఊర్లో సేనామందికి తెల్దు. ఉన్నప్పుడు ఏటోడ్డు మిల్లీ అవసరం పడితే ఆడు సేనా గురుతొచ్చోడు. దాన్నెమూట మొయ్యాలంతే ఆడుండాల. దాన్నెమాడాక సిట్టు తౌడు ఏరుపాటుగా మూటకట్టాలంటే ఆడుండలా, మళ్లీ బియ్యంమూట ఇంటికి మోసుకురావాలంతే ఆడే ఆడే సెయ్యాల. ఆడు సచ్చిపోయేదాకా తెలనేదు ఊరందరికీ ఎసట్లోకి బియ్యమయ్యే ఆడిచేతులకి సేతులకి అన్నం ముద్దే కనా కట్టమని' అంటూ మిల్లీలో శ్రామికుడైన అప్పలస్వామి మరణించాక కూడా శ్రమను గుర్తుచేసుకుంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్న తీరును విజయనగరం జిల్లా మెంటాడకు చెందిన యువ కవి పాయల మురళీకృష్ణ తన కవిత ద్వారా కళ్లకు కట్టినట్టుగా వినిపించాడు.

'ఔనౌను..! భారత దేశం వికశిస్తోంది. కానీ, ఆ వికాశం పేదలు, మధ్యతరగతి ప్రజలకు కనిపించడం లేదు. కేవలం పెట్టుబడుదారులకే ఆ ప్రకాశవంతమైన దివిటీలు కనిపిస్తున్నాయి. కానీ, వెలుగు వెనుక ఉన్న చీకటి మోసం మాత్రం కార్మికవర్గానికి స్పష్టంగానే కనిపిస్తోంది' అంటూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వికసిత్ భారత్ ప్రచారంపై మరో కవి హుస్సేన్ తన కలంతో గళాన్ని వినిపించారు. యువతకు ఉపాధీ లేదు - రైతుకు గిట్టుబాటు ధరా లేదు - కార్మికులకు పనిగంటల పరిమితీ లేవు - ఇదే మీరు వికసింపజేస్తున్న తీరు అంటూ కేంద్ర ప్రభుత్వానికి చురకలందించారు.

'అంటుకోకు నాయనా అంటుకోకు... మమ్మల్ని ఎవుల్నీ అంటుకోకు... ఊరికొసారి ఉరిపోసుకున్న గుడిసెలు మావి గోసికి జబర గుండారకి కురస అయిపోయిన బతుకులు మావి, అంటుకోకు' అంటూ ఓ ఊరిలో కులవివక్ష చూపిమరీ చాకిరీ చేసుకుంటున్న పెత్తందారుడ్ని ప్రశ్నిస్తున్న తీరును ఉత్తరాంధ్రా యాసలో పక్కి రవీంద్ర అనే సాహితీకారుని కవనానికి సభికుల హర్షధ్వానాలు మారుమోగాయి. 'అందరి భూముల్నీ బకాసురుడిలాగ ఆబరించేసి... ఇప్పుడు పెద్దమడిసిననుకోని ఇరగబడిపోతున్నావు' అంటూ పెత్తందారుడి దోపిడీని సామన్యుడు ప్రశ్నించే తీరు చెప్పుకొచ్చారు.

'మాట్లాడు.. ఏదో ఒకటి మాట్లాడు... నీలోపల... లోలోపల.. ఓసారి తొంగిచూడు నీ చుట్టూ అల్లుకున్న చీకట్లను భయాలను పక్కకునెట్టి కనీసం నీతో నువ్వైనా మాట్లాడు' అంటూ కవి సిరికి స్వామినాయుడు చెప్పుకొచ్చారు. 'మాట్లాడకపోతే నీలోని ఒక ధీరోదాత్తుడైన మానవునితో సంభాషించే సద్భాగ్యాన్ని కోల్పోతావు కదూ... నిన్ను నివ్వే కోల్పోతావు' అంటూ మౌనం వల్ల జరిగే ప్రమాదాన్ని, ముంచుకొస్తున్న ముప్పును వివరించారు.

'నాలుగు కోడ్లు కొత్తవి... దోపిడీ మార్గాలు, చేసే గాయాలు పాతవి, హక్కుల పుస్తకంలో అక్షరాలు కరిగి, లాభాల ఖాతాలో సున్నాలు పెరిగి' అంటూ విజయనగరానికి చెందిన రచయిత, కవి డాక్టర్ జివిఎస్ జయపాలరావు శ్రమదోపిడీ కోసం ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్ల కుతంత్రాన్ని బయటపెట్టారు. చరిత్ర నేర్పిన పాఠాన్ని సమీక్షించు... నూతన పోరాటానికి స్ఫూర్తినొందు అంటూ శ్రమజీవులు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని కూడా అందులో నొక్కిచెప్పారు.

టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది కొరత

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏడాదిగా సిబ్బంది కొరత వెంటాడుతుంది. సిబ్బంది సరిపడా లేక టౌన్ ప్లానింగ్ విభాగంలో సమస్యలు పేరుకు పోతున్నాయి. గతంలో ఈ జోనల్ కార్యాలయంలో ఒక ఎసిపి అధికారితోపాటు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, మూడు నుంచి నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారు. ఏడాదిగా ఒక ఎసిపి స్థాయి అధికారి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌తోనే కాలం గడుపుతున్నారు. ప్రస్తుతానికి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కూడా లేకపోవడంతో అంతా ఎసిపి చూడాల్సి వస్తోంది. ఆ ఎసిపి కూడా అనకాపల్లి జోన్‌కు ఇన్‌చార్జి కావడంతో, గాజువాకలో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనులు అడుగు ముందుకు జరగడం లేదు. ప్రజలకు సంబంధించిన సమస్యలేమీ పరిష్కారం కాక ప్రతి సోమవారమూ గాజువాక జోనల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గాజువాక జోన్ 20 వార్డులుగా విస్తరించి ఉంది. నాలుగు వార్డులు అగనంపూడి జోన్‌కు కేటాయించినప్పటికీ, 16 వార్డుల పని గాజువాకతో ముడిపడి ఉంది. ఇలాంటి జోన్‌కు పర్మినెంట్ అధికారులు లేకపోవడం శోచనీయం.

వార్డు పరిధిలో సచివాలయం, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ ఉన్నప్పటికీ, వారికి నిర్ణయాధికారం లేకపోవడంతో, జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల కాలయాపన అవుతుంది తప్ప, స్థానిక ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదు. గతంలో అధికారులు అందరూ ఉండడంతో నిర్ణయాలు వేగవంతంగా తీసుకునేవారు. దీంతో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేవి. ప్రస్తుతం ఆ దిశగా పనులు జరగకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గాజువాక జోన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఎవరైనా వస్తే సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా జివిఎంసి కమిషనర్ స్పందించి పర్మినెంట్ అధికారులను తక్షణమే నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వివిఎంఆర్‌డి కమిషనర్ తేజభరత్

పుస్తక ప్రదర్శనకు పోటెత్తిన పాఠకులు

అందుబాటులో అనేక రకాల పుస్తకాలు
విశాఖ పుస్తక మహోత్సవంపై పలువురు హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్

శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విద్య, సాహిత్యం, పోటీ పరీక్షలు, పిల్లల పుస్తకాలతో అన్ని రంగాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పుస్తక ప్రదర్శన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు పాఠకులు అభిప్రాయపడ్డారు. పుస్తకాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రదర్శనను సందర్శించిన పాఠకులు పుస్తక ప్రదర్శనపై తమ అనుభవాలను వెల్లడించారు.

ఒకే చోట అన్ని పుస్తకాలు

విద్యార్థులకు అవసరమైన రిఫరెన్స్ పుస్తకాలు ఒకేచోట లభించడం చాలా సంతోషంగా ఉంది. చిన్న వారి నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల వారిని ఆకట్టుకొనే పుస్తకాలు ఉన్నాయి.

పాయల మురళీకృష్ణ,
యువ కవి,
ఉపాధ్యాయులు

పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి

పౌరాణిక, వైజ్ఞానిక, చారిత్రక అంశాలతో కూడిన పుస్తకాలన్నీ ఈ పుస్తక ప్రదర్శనలో ఉంచారు. సాహిత్య పుస్తకాల కలెక్షన్ చాలా బాగుంది. కొత్త రచయితల పుస్తకాలు కూడా ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది.

ఆళ్ల అప్పారావు,
రిటైర్డ్ లెక్చరర్.

మంచి కార్యక్రమం

పుస్తకాలు కరువైపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి ప్రదర్శన చాలా మంచిది. అన్ని రకాల పుస్తకాలు ఒకే చోట కొలువుదీరాయి అంటే ఆనందమే కదా. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు యువతకు మార్గదర్శకంగా ఉంటాయి. అనేక రచయితల గ్రంథాలు స్ఫూర్తిగా నిలుస్తాయి.

పడాల కవిస్వరరావు,
రిటైర్డ్ మెడికల్ హెల్త్ ఉద్యోగి.

ప్రతి పుస్తకం కొనాలనిపించేలా ఉంది

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఏది చూసినా కొనాలనిపించేలా ఉన్నాయి. పిల్లల కోసం నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు ఎక్కువగా ఉండటం నచ్చింది.

లిఖితాయ శ్వేత,
ఎంబిబిఎస్ విద్యార్థిని.

చాలా హ్యాపీగా ఉంది

వ్ర న్త క్ ప్రదర్శనకు మాములుగా వచ్చా. ఈ ప్రదర్శనలో ఉన్న పుస్తకాలు చూశాక భిన్నమైన అనుభూతి కలిగింది. ఎంతో విజ్ఞానం, స్ఫూర్తిదాయకమైన అనేక పుస్తకాలను చూసి మనసులో హాపీ ఫీల్ ఏర్పడింది.

పి. ఇందుమతి,
ఎంబిబిఎస్ విద్యార్థి.

పోటీ పరీక్షలకు దోహదపడేలా ఉన్నాయి

ఈ పుస్తక ప్రదర్శనలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే తాజా ఎడిషన్ పుస్తకాలు లభించాయి. ఎవరైనా కొనుక్కునేందుకు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. ఇలాంటివి మాకు చాలా ఉపయోగపడతాయి.

వంశీ,
డిగ్రీ , విద్యార్థి

దేవరకొండ బాలగంగాధర్ పుస్తకం కొన్నాను

ఎ ద్ద రచయితల గ్రంథాలన్నీ ఒకచోటే లభించడం అరుదు. దేవరకొండ బాలగంగాధర్ తిలక్ వంటి కవి పుస్తకాలు దొరకడం కష్టం. అలాంటి పుస్తకాలను, ఆధ్యాత్మిక గ్రంథాలు, జీవిత దిశను చూపించే పుస్తకాలు మనసుకు హత్తుకున్నాయి.

పి. రవీంద్రనాథ్,
కవి, టీచర్.

2 వరకు ప్రదర్శన కొనసాగుతుంది

సిఐటియు మహాసభలు సందర్భంగా పాఠకులకు అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు ఉంచాలనే విశాఖ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశాం. సుమారు 100 మంది ప్రచురణ కర్తలకు సంబంధించి లక్ష పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచాం. దేశ భక్తులు, పోరాటయోధుల పుస్తకాలు, ఉత్తరాంధ్ర, రాష్ట్ర కవులకు సంబంధించిన పుస్తకాలు ఉంచాం. పిల్లల నుంచి పెద్దల దాకా అన్ని రకాల పుస్తకాలు అందుబాటు ధరల్లో అందిస్తున్నాం. జనవరి 2 వరకు కొనసాగే ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయ్ కిరణ్,
పుస్తక ప్రదర్శన నిర్వాహకులు.

చాలా బాగుంది.. మళ్లీ వస్తా

కార్టూన్, ఆటలతో కూడిన పుస్తకాలు చాలా ఉన్నాయి. స్కూల్ పుస్తకాలకు అనుబంధంగా కొన్ని ఉన్నాయి. దాడీని తీసుకొని మళ్లీ వస్తా.

లక్ష్మీ సహస్ర,
విద్యార్థిని, ఏడో తరగతి.

సామాజిక చైతన్యానికి ప్రతీకగా లఘు చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖనగరంలో ఈనెల 31 నుంచి జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రామిక ఉత్సవం కళాకారుల సృజనాత్మకతకు, సామాజిక బాధ్యతకు వేదికగా నిలిచింది. ఆదివారం రెండో రోజు జరిగిన లఘు చిత్రాల ప్రదర్శనలో ఏడు చిత్రాలను ప్రదర్శించగా, ఇవి ప్రేక్షకులను ఆలోచింపజేయడంతో పాటు సమాజంలోని వివిధ కోణాలను ఆవిష్కరించాయి. ఈ ప్రదర్శనలో ప్రధానంగా సామాజిక సమస్యలు, రాజ్యాంగ హక్కులు, శ్రామిక జీవుల వ్యధలను కథా వస్తువులుగా తీసుకున్నారు.

నిడదవోలుకు చెందిన మెహర్ కట్ల రూపొందించిన 'సాలగ్రామ హనుమంతరావు' చిత్రంతో ప్రారంభమైన ఈ ప్రదర్శన, ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

మాట్లాడుతున్న తేజభరత్

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొత్తపల్లి సీతారాం నిర్మించిన 'వీరి బతుకు' చిత్రం ఉత్తరాంధ్ర జనజీవన చిత్రణను, వారి కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపింది.

విజయవాడకు చెందిన ఆర్ భార్గవరాయ్ రూపొందించిన 'ఫ్రీడమ్ ఆర్టికల్ 21' ప్రస్తుత కాలంలో వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ పరమైన హక్కుల ప్రాముఖ్యతను ప్రశ్నించింది.

రైతు సమస్యలపై కె.దుర్గారావు నిర్మించిన 'జై కిసాన్' చిత్రం అన్నదాతల ఆవేదనను ప్రతిబింబించగా, ఉమామహేష్ నిర్మించిన 'ఇంక్' చిత్రం విలక్షణమైన ముగింపుతో ఆకట్టుకుంది.

విశాఖకు చెందిన మోటూరు శ్రీనివాస్ కుమార్ నిర్మించిన శర్మదేవోభవ లఘు చిత్రం చదువుకున్న మేధావి వర్గం, మధ్యతరగతి కుటుంబాలు సమాజం పట్ల ఉండాల్సిన బాధ్యతను ప్రశ్నించింది.

విశాఖపట్నంకు చెందిన సనరా వంశీ నిర్మించిన మాతృదేవోభవ లఘు చిత్రం తల్లి ప్రేమ, బాధ్యత అన్న అంశానికి సామాజిక బాధ్యతను జోడించి ప్రస్తుత సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, మాతృమూర్తి పట్ల సమాజంలో ప్రదర్శించాల్సిన గౌరవం వంటి అంశాలను ఇందులో చర్చించినట్లు కనిపిస్తుంది.

విశాఖపట్నంకు చెందిన దర్శకుడు ఉమామహేష్ నిర్మించిన ఇంక్ లఘు చిత్రం రాతకు ఉన్న శక్తిని, కలం పట్టిన మేధావి సమాజంలో ఎలాంటి విప్లవాన్ని ఎలా తీసుకురాగలడో వివరించింది.

లఘుచిత్రాలు సమాజంలో మార్పు తీసుకొచ్చే ఆయుధాలు : విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజభరత్

ఈ ప్రదర్శనను తిలకించిన విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజభరత్ దర్శకులను ప్రత్యేకంగా అభినందించారు. లఘు చిత్రాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సమాజంలో మార్పు తీసుకొచ్చే ఆయుధాలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా యువ దర్శకులు వాస్తవికతకు దగ్గరగా చిత్రాలను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలు కేవలం విశాఖకే పరిమితం కాకుండా విజయవాడ, నిడదవోలు, ఖమ్మం వంటి ఇతర ప్రాంతాల కళాకారులకు ఇది ఒక గొప్ప వేదికగా నిలిచింది. తక్కువ నిడివిలో ఎక్కువ ప్రభావాన్ని చూపేలా సామాజిక సమస్యలను విశ్లేషించడం దర్శకుల పరిణతిని తెలియజేస్తుంది. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్ అసోసియేషన్ సభ్యులైన ఎల్లాజీ, కుమార్ రాజా తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కళాకారుల మధ్య సమన్వయాన్ని పెంచింది. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ ప్రదర్శనలు, కళ అనేది కేవలం కళ కోసం మాత్రమే కాదు, అది ప్రజల కోసం అనే సందేశాన్ని బలంగా చాటిచెప్పాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
సోమవారం 29 డిసెంబర్ 2025

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

శ్రామిక ఉత్సవ్ అదరహో

- ఆకట్టుకున్న కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు
- అబ్బురపరిచిన నృత్య రూపకాలు : ఆలోచింపజేసిన సైన్స్ ప్రదర్శనలు - శ్రమకవనానికి స్పందన

CITU
18th ALL INDIA CONFERENCE

రెండో రోజు ఆదివారం విశాఖ సాగర తీరం ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వీక్షకుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. అత్యధిక సంఖ్యలో ఇక్కడి ఎగ్జిబిషన్ స్టాల్స్ వద్ద ప్రజలు గుమిగూడి తిలకించారు. ప్రజానాట్య మండలి కళాకారుల బృంద గానాలు, కళాకారుల సోలో పాటలు ఆద్యంతం వీక్షకులందరినీ ఉర్రూతలూగించాయి. చిన్న పిల్లలు సైతం 'శ్రామిక ఉత్సవ్' వేదికపై జరిగిన డ్యాన్సులకు హావభావాలతో ఆనందిస్తూ కేరింతలు కొట్టడం, కోలాటం కర్రలతో నృత్యం చేయడం కనిపించింది. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' రెండో రోజూ సందడి నింపింది. సైన్స్, కార్టూన్ ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి. శ్రమకవనం ఆలోచింపజేసింది.

నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ కళాకారులు

శ్రామిక ఉత్సవ్‌కు హాజరైన ప్రజానీకం

విప్లవగీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

విద్యార్థుల నృత్య రూపకం

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

నాటికలోని ఓ సన్నివేశం

మాట్లాడుతున్న కృష్ణయ్య



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న వైద్య విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల కళారూపాలు

కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తేజభరత్, చిత్రంలో సిహెచ్.నర్సింగరావు

స్ఫూర్తి నింపిన మందస జీడి కార్మికుల పోరాటం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వందలాది జీడి పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. యాజమాన్యం ఎంత దయతలిస్తే అంతే కూలీ తీసుకుంటున్న పరిస్థితి ఉంది. కానీ, మందస ప్రాంత జీడి కార్మికుల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. తమకు పనికి తగ్గటు కూలి కోసం సంఘటితంగా పోరాడి స్ఫూర్తిగా నిలిచారు. యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. చివరకు అధికారులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పించారు. యాజమాన్యం, కార్మికులతో చర్చించి కూలీ రేట్లు పెంచేలా అధికారులు ఆదేశించారు. ఇది జిల్లాలో పని చేస్తున్న ఇతర జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల్లో స్ఫూర్తిని నింపింది. మందస ప్రాంతంలోని హరిపురం, బైరిసారంగపురం, రాధాకృష్ణాపురం పరిసర గ్రామాల్లో మొత్తం ఏడు వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో సుమారు 300 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మందస, సారంగపురం, మూలిపాడు, పింపిలి, సిద్ధూరు, తొండిపూడి, రాధాకృష్ణాపురం తదితర గ్రామాల నుంచి పరిశ్రమలో పనిచేస్తున్నారు. అంతా రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందిన వారే. దుర్భరమైన బతుకులతో భారంగా జీవనం నెట్టుకొస్తున్నారు. వీరికి కనీస కూలీ ఇవ్వకుండా యాజమాన్యం దోపిడీ సాగిస్తోంది. పిక్కలను ఒలవడానికి ధర ఇవ్వకుండా దాని నుంచి వచ్చిన పప్పు ఆధారంగా యాజమాన్యం డబ్బులు ఇస్తోంది. నాలుగు కేజీల పిక్కలను వలవగా వచ్చే కేజీ జీడిపప్పుకు రూ.32 కూలీ ఇస్తున్నారు. కూలీ రేట్ల ఒప్పందం ముగిసినా యాజమాన్యం దానినే కొనసాగిస్తుండటంతో తమకు రేట్లు పెంచాలని యాజమాన్యాన్ని కోరారు. దీనిపై యాజమాన్యం ప్రతినిధులు ససేమిరా అనడంతో కార్మికులు సంఘటితమై సిఐటియు ఆధ్వర్యాన అనేక రూపాల్లో ఆందోళనలు సాగించారు.

శ్రీకాకుళం : మందసలో కూలీ రేట్ల పెంపు కోసం ర్యాలీ చేస్తున్న జీడి కార్మికులు (ఫైల్)

మహిళా కార్మికులకు మరుగుదొడ్లూ కరువే

ఆందోళనలతో దిగొచ్చిన యాజమాన్యం
ఏ జీడి పరిశ్రమలో ఇవ్వని కూలీ రేటును దక్కించుకున్న వైనం

జీడి పరిశ్రమల్లో పనిచేసేందుకు వచ్చిన వారిలో అధిక శాతం మంది మహిళలే ఉన్నారు. యాజమాన్యాలు వారికి కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించడం లేదు. భోజనాలు చేసేందుకు గదులు కూడా ఉండకపోవడంతో అపరిశుభ్ర పరిస్థితుల నడుమే ఆహారం తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. కనీసం కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు నీళ్లు కూడా లేని పరిస్థితి ఉంది. బడిలో చేర్చని పిల్లలతో వస్తున్న తల్లులు అక్కడ పడరాని పాట్లు పడుతున్నారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలంటూ కార్మికులు తమ పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు.

పోరాట ఫలితంగా పెరిగిన కూలి రేట్లు

కూలీ రేట్ల విషయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై విశాఖపట్నంలోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్, డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో టెక్కలి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ యాజమాన్యాల ప్రతినిధులతో చర్చలు జరపడంతో రేట్లు పెంచేందుకు అంగీకరించింది. అప్పటివరకు కేజీకి రూ.32 ఉన్న కూలీని రూ.34.50కు పెంచింది. దీంతో జిల్లాలో ఏ జీడి పరిశ్రమల్లోనూ లేని రేటు వారికి దక్కింది. లేబర్ కమిషనర్ల ఒత్తిడితో రేట్లు పెంచిన యజమాన్యం ప్రతినిధులు వారిపై ఒకరకంగా కక్ష సాధింపు చర్యలకు దిగింది. పరిశ్రమకు వచ్చేందుకు అప్పటివరకు ఏర్పాటు చేసిన ఆటోలను ఆపేసింది. వారికి పనిదినాలు తగ్గించేలా ప్లాన్ చేసింది. గ్రామాల్లో అనధికారికంగా షెడ్లు ఏర్పాటు చేసి అక్కడ పనులు ప్రారంభించింది.


కార్టూన్‌లను ప్రదర్శిస్తున్న బాలిక

చిన్నచిత్రం... పెద్ద సందేశం

ఆకట్టుకున్న కార్టూన్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -ఆనందపురం

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు సందర్భంగా నిర్వహించిన కార్టూన్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌లో చిన్న చిత్రాల ద్వారానే పెద్ద సందేశాలను సమాజానికి చేరవేయవచ్చని నిరూపించారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు వందమంది కార్టూనిస్టులు పాల్గొని సామాజిక, రాజకీయ, శ్రామిక వర్గ సమస్యలను ప్రతిబింభించే కార్టూన్లను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో సూపర్ సీనియర్ విభాగంలో రామారావు ప్రథమ స్థానం, ప్రసాద్ ద్వితీయ స్థానం, సుధాకర్ తృతీయ స్థానం సాధించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వ విధానాలను మేకల బలితో పోల్చుతూ రామారావు రూపొందించిన కార్టూన్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్టూన్‌కు గానూ ఆయనకు ప్రతిభా బహుమతి అందజేశారు. అలాగే కార్టూనిస్టు ప్రసాదు మతసామరస్యత, సామాజిక ఐక్యత, యువత ఉద్యోగ సమస్యలు, కలలు - వాస్తవాల మధ్య వ్యత్యాసాలను తన కార్టూన్లలో సృజనాత్మకంగా ప్రతిబింభించారు. శ్రామిక యువకులు, కార్పొరేట్ శక్తులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్న సందేశాన్ని ఆయన కార్టూన్లు స్పష్టంగా చాటాయి. వర్క్ ఫ్రమ్ హోమ్, ఇంటి పనులు, విద్య, టీవీ సీరియల్స్ మధ్య మహిళల ఆలోచనలను హాస్యాత్మకంగా కార్టూన్ రూపంలో చూపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీలకు బి.హరి వెంకట రమణ, కోరాడ రాంబాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేతలు వీరే.... (ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు)

సూపర్ సీనియర్ విభాగం : రామారావు, ప్రసాదు, సుధాకర్

సీనియర్ విభాగం : రష్మిక, ప్రేమ్, శిల్ప, సజన

జూనియర్ విభాగం : నిర్మల్, హైది, భువన

ఉత్సాహంగా సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఆనందపురం

విశాఖపట్నం ఎయు మైదానంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు సందర్భంగా రెండో రోజు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఉత్సాహంగా సాగింది. ఈ ఎగ్జిబిషన్‌లో 18 కళాశాలల నుంచి సుమారు 50 సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. తగరపువలస ఎన్ఆర్ఐ విద్యార్థులు, మెడికల్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన లైవ్ డెమోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సిఐటియు జాతీయ తొలి అధ్యక్షులు నుంచి 17 వరకు ఫొటోలను రైల్వే బోగీల ఆకృతిలో ప్రదర్శించిన డెమో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐక్యత శక్తిని వివరించేలా గాజు పెంకులపై సమూహంగా నడిస్తే ఎలాంటి హాని జరగదని, ఒక్క గాజు పెంకుపై నడిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వివరించారు. అలాగే మేకులను సమూహంగా అమర్చి వాటిపై కూర్చుంటే హాని కలగదని, ఒక్క మేకుపై కూర్చుంటే ప్రమాదం జరుగుతుందనే ప్రయోగాలు ఐక్యత ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేశాయి.

అదేవిధంగా 'మాయ లేదు, మంత్రం లేదు' అనే సందేశంతో నిర్వహించిన మ్యాజిక్ షో ప్రదర్శకులను ఆకట్టుకుంది. జన విజ్ఞాన వేదిక ప్రతినిధి సిహెచ్ శ్రీరాములు (ధవలేశ్వరం) మ్యాజిక్ షో నిర్వహించారు. అందులోని రహస్యాలను శాస్త్రీయంగా వివరిస్తూ ప్రేక్షకుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు. నీళ్లు లేకుండానే సీసాలో నీళ్లు రావడం, గాలిలో నుంచి పూలు పుట్టించడం, కాగితాలు తానుగా మార్చడం, తెల్ల కాగితాలపై అక్షరాలు కనిపించడం వంటి ప్రయోగాలను ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ మూఢనమ్మకాలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు శాస్త్రీయ అవగాహన అవసరమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు జి. మురళీధర్ ప్రసాద్, పరశురాం, శేషగిరిరావు, రత్నారావు, స్వామి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న మాయ లేదు... మంత్రం లేదు... మ్యాజిక్ షో

మ్యాజిక్‌షో ప్రదర్శిస్తున్న శ్రీరాములు

ఎగ్జిబిషన్‌కు సైన్స్ నమూనాను తీసుకొస్తున్న విద్యార్థులు

అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న దృశ్యం

నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

నాటక రంగాన్ని ఆదరించాలి

ఆహ్వాన నాటకోత్సవాల ప్రారంభంలో ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి -అనకాపల్లి : నాటకరంగం కనుమరుగు కాకుండా ఆదరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జార్జి క్లబ్, హైదరాబాద్ మహతి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి కళలకు పుట్టినిల్లని, ఈ ప్రాంతం నుంచి ఎంతోమంది కళాకారులు నాటక, చలనచిత్ర రంగాల్లో ఉన్నారన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ నాటకోత్సవాన్ని అందరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, జార్జ్ క్లబ్ అధ్యక్షులు బి.ఎస్.ఎం.కె జోగినాయుడు, కార్యదర్శి కాశి విశ్వనాథ్, ఉపాధ్యక్షులు విల్లూరి చంద్రశేఖర్, చలనచిత్ర నటులు సుబ్బరాయ శర్మ, డి రామ కోటేశ్వరరావు, హైదరాబాద్ తెలుగు డ్రామా అడ్మిన్ పిటి మాధవ్, కే బి ఎం వెంకటరావు, విల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

అవకాశాల సద్వినియోగం చెప్పే 'సమయం'

అనంతరం మొదటి ప్రదర్శన అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'సమయం' నాటిక.ప్రదర్శించారు. దేవరకొండ బాలగంగాధర్ తిలక్ మూల కథతో శ్రీ స్నిగ్ధ నాటకీకరణ చేయగా దర్శకత్వం ఎన్ రవీంద్ర రెడ్డి వహించారు. కథ అంశాన్ని స్థూలంగా పరిశీలిస్తే ప్రతి మనిషికి జీవితంలో టర్నింగ్ పాయింట్ వస్తుంది. ఆ సమయాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న వ్యక్తి అభివృద్ధి సాధిస్తాడు. సామాన్యుడు రాజు అవుతాడు, రాజు కుబేరుడు అవుతాడు. అయితే ఆ సమయాన్ని అనుకూలంగా మార్చుకోలేని వ్యక్తి మర్చిపోయి పరిగెడితే అందమైన జీవితం అపార్థంలా మారుతుంది. అలాంటి విచిత్రమైన కథ ఈ నాటికలో రాఘవరావు పాత్ర. అతను తన ప్రయాణంలో గెలిచాడో ఓడాడో పక్కన పెడితే సమయాన్ని వదిలేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో రాఘవరావు పాత్ర ద్వారా అర్థమవుతుంది. ఈనాటికలో పాత్రధారులు రవీంద్రరెడ్డి, విసిహెచ్‌కె ప్రసాద్, లక్ష్మణ శాస్త్రి, శ్రీలేఖ, కుమారి కుసుమ సాయి సమయోచితంగా నటించి ప్రాక్షకుల మన్ననలు అందుకున్నారు.

దాంపత్య విలువను చాటే 'నువ్వో సగం'

రెండో ప్రదర్శనగా హైదరాబాద్ మల్లీశ్వరి ఆర్ట్స్ వారి' నువ్వో సగం' నాటిక. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం కావాలి. మగవారితో సమాన హక్కులు కల్పించాలి. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య నువ్వెంతో నేను అంతే అన్న ధోరణిలో ఉంటే సంసారం సవ్యంగా నడవదు. కష్ట సుఖాల్లో కలిమిలేముల్లో కలసి మెలసి జీవించేదే నిజమైన దాంపత్యం అని నిరూపించిందే ఈ నాటిక. ఇందులో పాత్రధారులు పి సుబ్బారావు, వై శ్రీనివాస్, సురభి లలిత అద్భుతంగా నటించి ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఈ నాటిక రచన భవాని ప్రసాద్ కాగా, పొలిమెట్ల సుబ్బారావు దర్శకత్వం వహించారు. అలాగే మరో రెండు రోజులపాటు జరిగే ఈ నాటకోత్సవాలను అనకాపల్లి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు, కళాకారులు కళాభిమానులు తిలకించి విజయవంతం చేయాలని నాటకోత్సవాల కన్వీనర్ కెఎం.నాయుడు విజ్ఞప్తి చేశారు.

'సమయం' నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం

టిడిపి బలోపేతానికి కృషి

తాతయ్య బాబును సన్మానిస్తున్న గంగాధర్ తదితరులు

ప్రజాశక్తి-చోడవరం : టిడిపి బలోపేతానికి, పార్టీ పటిష్టతకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆదివారం రాయపురాజుపేట వచ్చిన సందర్భంగా గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, సర్పంచ్ బొడ్డేడ రామానాయుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ ప్రభాకర్, మళ్ల జగ్గారావు, బుద్ధ లక్ష్మీ సింహాచలంనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ బొడ్డేడ వెంకట అప్పారావు తదితరులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమపై నమ్మకం ఉంచి రెండవసారి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, కార్యకర్త మొదలు ప్రజా ప్రతినిధుల వరకు అందరినీ సమన్వయం చేస్తూ పనిచేస్తామన్నారు.

ఉపాధ్యాయుడు మూర్తి ఉదారత

సొంత నిధులతో స్టడీ మెటీరియల్, డ్రైఫ్రూట్స్ అందజేత

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎవిఎన్ మూర్తి తన ఉదారతను చాటుకున్నారు. ప్రస్తుతం పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమౌతున్న నేపథ్యంలో వారికి చేదోడుగా ఉండేందుకు విద్యార్థి మేలుకో కార్యక్రమాన్ని చేపట్టి, తన సొంత నిధులతో. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను, పౌష్టికాహారంగా పండ్లు, డ్రైఫ్రూట్స్ అందించి ఆదర్శనీయంగా నిలుస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం గ్రామాల్లో పర్యటిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఆదివారం దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి తదితర గ్రామాల్లో పర్యటించి, 35 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పండ్లు, డ్రైఫ్రూట్స్ అందజేశారు. ఉపాధ్యాయుడు మూర్తి సేవాభావాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

వైసిపి పోరాటంతో దిగొచ్చిన ప్రభుత్వం

అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే మునగపాక కొనసాగింపు : బొడ్డేడ ప్రసాద్

ప్రజాశక్తి -మునగపాక: మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్‌లోనే కొనసాగేలా కేబినెట్ సబ్ కమిటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమని వైసిపి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాదు అన్నారు. అయితే డిఆర్‌సి తీర్మానం మేరకు మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలను కూడా అనకాపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న నక్కపల్లి రెవిన్యూ డివిజన్‌లో ఎలమంచిలి నియోజకవర్గాన్ని విలీనం చేయడాన్ని నిరసిస్తూ 15 రోజులు పాటు వైసిపి ప్రజాస్వామ్య బద్ధంగా చేసిన పోరాటాలకు కూటమి ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. దాని ఫలితమే ఇటీవల డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఇతర నాయకులు అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలు కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారని గుర్తు చేశారు. అయితే కేవలం మునగపాక మండలాన్ని మాత్రమే అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో కొనసాగించి, మిగతా మండలాలను కొత్తడివిజన్‌లో కలపడమంటే డిఆర్‌సి తీర్మానాలకు, ప్రభుత్వ మంత్రులు, ప్రజాప్రతినిధులు తీర్మానాలకు విలువ్వ లేదాయని ప్రశ్నించారు. ా ప్రభుత్వం పునరాలోచించి అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలను కూడా అనకాపల్లి రెవిన్యూ డివిజన్లోనే కొనసాగేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎపిపిఆర్ మినిస్టీరియల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నూతన కమిటీకి సత్కారం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎపిపిఆర్ మినిస్టీరియల్ అసోసియేషన్ అనకాపల్లి యూనిట్ నూతన కార్యవర్గం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డివిఎస్ గౌరీపతిరావు, ఎన్నికల పరిశీలకులు ఆర్‌వి నాగరాజు వ్యవహరించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయ ఎఒ డి రాము, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.ఎ.ఖాన్(కసింకోట), కార్యదర్శిగా జిఎల్ నరసింగరావు(ఆర్డబ్ల్యూఎస్ అనకాపల్లి), జాయింట్ సెక్రటరీగా ఎఎస్‌వి రమణ(మార్టూరు), కోశాధికారిగా టివిఎస్ వి ప్రసాద కుమార్ (మునగపాక), జిల్లా కౌన్సిలర్లుగా సిహెచ్ గణేష్ (అనకాపల్లి), పి రామ్‌కుమార్ (కసింకోట) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నిక ప్రక్రియ అబ్జర్వర్, మినిస్టీరియల్ జిల్లా సంఘం అధ్యక్షులు ఎస్ సత్తిబాబు, జి గంగాధర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎ.సత్యనారాయణ అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -కశింకోట : స్థానిక డిపిఎస్ జెడ్పి హైస్కూల్ 1992-93 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సత్యనారాయణమూర్తి దేవస్థానం వద్ద కలిశారు. 33ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ సహచరుల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి సాయపడాలని తీర్మానించారు. దీనికోసం శాశ్వత నిధి ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు ఆళ్ళ వెంకటఅప్పారావు, నంబారు సత్య రావు, మళ్ల రాంబాబు, దాడి ఉదయ్ కుమార్, మేడిశెట్టి నూక రాజు, పేలూరి గణేష్, నంబారు రమణ, భర్నికాన సింహా చలనాయుడు, కోనగంగరాజు, చెల్లిబోయిన బాలేష్ పాల్గొన్నారు. అలాగే కశింకోట డిపిఎస్ జడ్పీ హైస్కూల్ 1984 -85 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ కలయిక బయ్యవరం ప్రమీల గార్డెన్‌లో ఆదివారం జరిగింది. విద్యార్థులు ఆటపాటతో ఆనందం గడిపారు. ఆరోగ్యానికి ధ్యానంపై శిక్షణ ఇచ్చారు.సహఫంక్తి భోజనాలు చేశారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయికకు సూచికగా గ్రూపు ఫొటో దిగారు.

అడ్డురోడ్డు డివిజన్ కేంద్రాన్ని ఒప్పుకోం

యలమంచిలి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు న్యాయ పోరాటం : వైసిపి

మాట్లాడుతున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతుంటే, కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా అడ్డురోడ్డు కేంద్రంగా నూతన రెవెన్యూ ఏర్పాటు చేయడం ప్రజా వ్యతిరేక చర్య అని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ మండిపడ్డారు. ఆదివారంపట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, నియోజవర్గం లోని అన్ని పంచాయతీలు,, మున్సిపాలిటీలోనూ యలమంచిలి కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నూతన రెవెన్యూ డివిజన్‌లో అన్ని మండలాలకు మధ్యన, సమాన దూరంలో ఉన్న యలమంచిలిని కాదని కనీసం పంచాయతీ కూడా కానీ అడ్డరోడ్డును, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయడం తగదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే న్యాయపోరాటం చస్తామని హెచ్చరించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జిఒ 1491 సవరించి, యలమంచిలి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామన్నారు.కార్యక్రమంలో అచ్చుతాపురం, రాంబిల్లి ఎంపిపిలు బుజ్జి, శ్రీనుబాబు, యలమంచిలి టౌన్ పార్టీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర, మున్సిపల్ వైస్‌చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కౌన్సిలర్లు పిల్లా త్రినాథ్, పిట్టా సత్తిబాబు, దూది నరసింహమూర్తి పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి,-యలమంచిలి టౌన్ : మండలంలోని జంపపాలెం గ్రామానికి చెందిన ఎల్లపు సతీష్ ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 50కుటుంబాలు ఆదివారం జనసేన తీర్థం తీసుకున్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసిపి భవిష్యత్తు లేదని,వచ్చేఎన్నికల్లోపు ఖాళీ అవడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై వీరు పార్టీలో చేరుతున్నారన్నారు.

ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో నరసింగబిల్లి గ్రామంలోని శీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలె వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉదయం 4 గంటలకు ఉత్తరద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ప్రకటనలో తెలిపింది. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చట్టపరమైన చర్యలు తప్పవనిట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ హెచ్చరించారు. ఆదివారం అనకాపల్లి మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన సిఐ వెంకటనారాయణ, అనకాపల్లి టౌన్ నెహ్రూచౌక్, కొత్తూరు జంక్షన్ల వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన ఎఎన్‌పిఆర్ కెమెరా ద్వారా హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోల ఓవర్‌లోడ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై సంబంధిత వాహనాల నెంబర్లు ఆటోమేటిక్‌గా నమోదై, జరిమానా చలానాలు ఆటోమేటిక్‌గా ఎలా రైజ్ అవుతున్నాయో ప్రత్యక్షంగా చూపించారు. పోలీసుల ప్రత్యక్ష నిఘా లేదని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఎన్‌పిఆర్ సిసి కెమెరాల ద్వారా కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమానా విధించారు. ఎస్‌ఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి,-యలమంచిలి టౌన్ : యలమంచిలి రైతు సేవా కేంద్రంలో 24 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, భూమి పాసుబుక్ తీసుకొచ్చి పొందవచ్చన్నారు. ప్రధానమైన వరిపంట కోతలు ముగిస్తుండడంతో, తదుపరి పాడి పరిశ్రమను దృష్టిలో పెట్టుకొని పశుగ్రాసం పెంపకానికి, ఉద్యానవన, కూరగాయ పంటలు, చెరకు కార్శి పంటలకు యూరియా అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఇండెంట్ పెట్టి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అగ్నిప్రమాద సహాయక చర్యలపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా బదిరోజు ఆదివారం స్థానిక ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ జివి.సత్యరాజు పాల్గొని అగ్నిప్రమాదాల సమయంలో సహాయక చర్యలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో మనల్ని కాపాడుకుంటూ సామాన్య ప్రజలను ఎలా రక్షించాలనే దానికి వివరించి, ఫైర్ ఫైటర్ల లక్షణాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను ఆదివారం కె.కోటపాడు మండల టిడిపి కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేవరాపల్లి మండలం నాగయ్యపేటకుచెందిన తమటపు బోగేష్‌కు రూ.74వేలు, తమటపు దండునాయుడుకు రూ.20,200, గరిసింగి పంచాయతీ చినగంగవానికి చెందిన అద్దిపల్లి ఈశ్వరమ్మకు రూ.62 వేలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రినాయుడు, ఆవుగడ్డ రామ్మూర్తినాయుడు, మండల పార్టీ మాజీ కార్యదర్శి శరకాన సూర్యనారాయణ, సర్పంచ్ కర్రి పుష్ప, నాయకులు కర్రి నాయుడు, గుల్లెడ్డి కొండలరావు(జికె) గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీరామ్, జాజిమకుల బోడేష్ పాల్గొన్నారు.

నేడు కశింకోటలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి -కశింకోట : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం అరబిందో కల్యాణమండపంలో సోమవారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొంటారని ఎంపిడిఒ సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ప్రజా దర్బార్‌లో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తేవచ్చన్నారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

ప్రజాశక్తి- కె.కోటపాడు : కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన 35 మంది కార్యకర్తలకు ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం కె.కోటపాడు, దేవరపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కె.కోటపాడు మండలంలో 16 మంది లబ్ధిదారులకు రూ. 8,77,093, దేవరాపల్లి మండలంలో ఏడుగురికి రూ.3,62,046 సాయం చెక్కులను అందజేసారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన గౌరవం ఇస్తుందన్నారు. గత జగన్ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను కుప్పకూల్చి, గ్రామాలను నాశనం చేశారని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీలకు కేటాయించిన వేలాది కోట్ల కేంద్ర నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి సర్పంచుల హక్కులను కాలరాసిందన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ బోర్డు చైర్మన్ పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మండల పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్, రెండు మండలాల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

విఆర్‌ఒల సంఘం నూతన కార్యవర్గం

జిల్లా విఆర్‌ఒల సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర కమిటీ ఆదేశాలతో అనకాపల్లి జిల్లాలో జిల్లా, డివిజన్ స్థాయి ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేయగా, ఈ నెల 27న అనకాపల్లి జిల్లా పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో నామినేషన్ ప్రక్రియలో ఒక పదవికి ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో వాటిని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి డి.రాజేష్ కుమార్, బి రాంజీ జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించి, నియామక పత్రాలు అందజేసారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పి శంకర్, అసోసియేట్ అధ్యక్షులు బి శ్రీనివాసరావు, పలివెల వెంకట్రావు, జిల్లా నలుమూల నుండి విఆర్‌ఒలు పాల్గొన్నారు.నూతన కమిటీలో జిల్లా అధ్యక్షులుగా అమిరపు శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఈరెళ్ల శివశంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా దేవాద చిన్నం నాయుడు, కోశాధికారిగాఆశ ఎన్నికయ్యారు. వీరిని జిల్లా గ్రామ రెవిన్యూ అధికారులు సంఘం అభినందించింది.

సెయింట్ జాన్స్ స్కూల్లో ఘనంగా వింటర్ కార్నివల్

ప్రజాశక్తి- కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఆదివారం వింటర్ కార్నివాల్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభ, జ్ఞానం, సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించే కార్నివాల్‌లో పాల్గొన్న 13వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండర్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, దేశసేవ పట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. ప్రదర్శన స్టాల్సను పరిశీలించారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధి బత్తుల నోబెల్‌కుమార్, కరస్పాండెంట్ అనురాధ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌సిసి కమాండర్ నీరజ్‌కుమార్

మానవతా విలువలతో సేవలు

ప్రజాశక్తి-సీతమ్మధార : గొప్ప మానవతా విలువలతో డాక్టర్ కెవిఎస్ఎల్‌జి.శాస్త్రి సేవలందించారని ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డాక్టర్ టి.రవిరాజు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన వైద్యాధికారి డాక్టర్ కెవిఎస్ఎల్‌జి.శాస్త్రి సంస్మరణ సభ ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం వైద్యుడిగానే కాకుండా వైద్యాధికారిగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణలో సమర్థవంతంగా పనిచేశారని, ఆయన మరణం సమాజానికి, వైద్య రంగానికి తీరనిలోటన్నారు. న్యూరోసర్జన్ డాక్టర్ ఎం.విజయశేఖర్ మాట్లాడుతూ, డాక్టర్ కెవిఎస్ఎల్‌జి.శాస్త్రి హుదూద్ తుపాను, కరోనా సమయంలో ఉత్తమమైన సేవలు అందించారన్నారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, గుండె జబ్బుల నిపుణుడు డాక్టర్ సివి.రావు, డాక్టర్ ఎన్ఎఎన్.మూర్తి, డాక్టర్ బి.అన్నపూర్ణేశ్వరరావు, డాక్టర్ ప్రయాగ మురళీకృష్ణ, డాక్టర్ పేరాల బాలమురళీ కృష్ణ, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ గౌరవాధ్యక్షుడు టిఎస్ఆర్‌ప్రసాద్, అధ్యక్షుడు కావూరు చరణ్‌కుమార్, కేసప్రగడ నరసింహమూర్తి, వేదుల హనుమంతరావు, శంకర్ నీలు, నండూరి సుబ్రహ్మణ్యం, ఆలమూరు ప్రభాకర్, డాక్టర్ శాస్త్రి అభిమానులు సంస్మరణ సభలో పాల్గొని శాస్త్రితో తమకున్న అనుభవాలు గుర్తుచేసుకున్నారు.

హాకీ అసోసియేషన్‌లో చేరాలి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన క్రీడాకారులు మాత్రమే జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో జిల్లా జట్టుతరఫున పాల్గొనే అవకాశం ఉంటుందని అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కె నరేష్, వైస్ చైర్మన్ జివి రెడ్డి కోరారు. ఆసక్తి, అర్హులైన క్రీడాకారులు జిల్లా అసోసియేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా క్లబ్‌లు, ఇతరత్రా మాయమాటలు చెబితే మోసపోవద్దని, అనకాపల్లి జిల్లా అసోసియేషన్‌కు వారితో సంబంధం లేదన్నారు. అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్‌కు ముఖ్య కేంద్రం 120ఏళ్ల హాకీ చరిత్ర కలిగిన ఎలమంచిలి పట్టణమని క్రీడాకారులు గుర్తించాలన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు

ప్రజాశక్తి -సబ్బవరం : కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు, సముచిత స్థానం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని అద్దూరులో వైసిపి ఇరువాడ గ్రామ నూతన కమిటీని అభినందించారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్, నాయకులు బోకం రామునాయుడు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటాన రాము, మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు, ఇరువాడ సర్పంచ్ బలిరెడ్డి కనకరాజు, ఆసకపల్లి ఎంపిటిసి కర్రి అప్పారావు, సబ్బవరపు నారాయణమూర్తి, దేడ్డం ప్రసాద్, మామిడి బంగారునాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు యడ్లనాయుడు, మచ్చ కోటేశ్వరరావు, దాడి సత్యనారాయణ, గవర రాజు, దువ్వ దుర్గాలు, అనకాపల్లి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్, సంద్రాన అప్పారావు పాల్గొన్నారు.

ఔను..ముగ్గురు మిత్రులు మళ్లీ ఒక్కటయ్యారు!

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఒకపుడు ఒకే మాటగా కలిసి రాజకీయాలు చేసిన ముగ్గురు మిత్రులు బత్తుల తాతయ్యబాబు, దాడి సూరినాగేశ్వరరావు, దాడి గోవింద మళ్లీ ఒక్కటయ్యారు.కొంత కాలంగా చిన్న స్పర్ధలతో వేర్వేరుగా ఉంటున్న వీరంతా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న మళ్లీ ఒకే చోటకు చేరారు. టిడిపి జిల్లా అధ్యక్షునిగా రెండోసారి తాతయ్యబాబును నియమించిన సందర్భంగా ఆయనను కలిసిన పూర్వమిత్రులు సత్కరించి, తమ పూర్వమిత్రునితో రాజకీయాలు చేసేందుకు సిద్ధపడ్డారు. దీంతో వడ్డాదిలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

ఇప్పటివరకు ఎవరు, ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో, ఏ శిబిరంలో చేరుతారో అర్థం కాక అయోమయ పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు పాతమిత్రులు ఒక్కచోటుకు చేరి ఒక క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో.స్టేట్ హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు స్వగ్రామం వడ్డాదిలో రాజకీయం ఆసక్తికరంగా మారింది.వడ్డాది మేజర్ పంచాయతీలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు గత కొంతకాలంగా రెండు వర్గాలుగా విడిపోయారు. బత్తుల తాతయ్య బాబు, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు వర్గాలుగా కొనసాగుతున్న పరిస్థితుల్లో బత్తుల మేనల్లుడు దొండా నరేశ్‌కు స్థానిక పిఎసిఎస్ చైర్మన్ పదవి లభించడంతో బత్తుల వర్గీయుల్లో జోష్ పెరిగింది. రెండు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతోనే నాలుగు నెలలుగా పిఎసిఎస్ కు నామినేటెడ్ బోర్డు ప్రకటించలేదు. చివరకు బత్తుల వర్గీయుడికే పిఎసిఎస్ చైర్మన్ పదవి దక్కింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు స్తబ్ధతగా ఉన్న కొంతమంది నేతలు తాతయ్య బాబును కలిసి అభినందనలు తెలిపి ఆయన శిబిరంలో చేరి పోతున్నారు. చాలా కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న రిటైర్డ్ విఆర్‌ఒ, మాజీ ఎంపిపి దాడి చిన గోవింద శనివారం తాతయ్య బాబును కలిసి అభినందించారు. ఆయనతోపాటు ఉప సర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, కస్పా కాలువ చైర్మన్ దాడి పెద గోవింద కూడా తాతయ్య బాబును కలిశారు.వీరివురూ కూడా గత కొంత కాలంగా తాతయ్య బాబు వ్యతిరేక శిబిరాలలోనే కొనసాగారు. మళ్లీ ముగ్గురు ఒకే శిబిరంలో చేరడంతో భవిష్యత్ రాజకీయాలపై ప్రజల్లో మరింత ఆసక్తి పెరిగింది.

రసవత్తరంగా వడ్డాది రాజకీయాలు

తాతయ్య బాబును అభినందిస్తున్న మిత్రులు

సిపిఎం నేత అప్పలరాజు అరెస్టుపై..

రాజయ్యపేటలో మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ మత్స్యకారులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్ పాల్గొని మాట్లాడారు. అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని, అక్రమ నిర్బంధాలను ఆపాలన్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం వెంటనే జీవో ఇవ్వాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు, ప్రజాసంఘాలు, లౌకికవాదులు, మేధావులు, అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి మహేష్ బాబు, దాకరపు శ్రీను, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు, సిపిఎం నాయకులు రాజేష్

అప్పలరాజును విడుదల చేయాలి

ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ సురేష్ బాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసును వెంటనే ఉపసంహరించి, తక్షణమే విడుదల చేయాలని ప్రజా రాజకీయ వేదిక డిమాండ్ చేసింది. ఆ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజారాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అప్పలరాజు అరెస్టుకు ఇచ్చిన ఆర్డర్‌లో 2013 మే నుండి 2025 డిసెంబర్ 10 వరకు మొత్తం 19 కేసుల్లో నిందితునిగా పేర్కొన్నారన్నారు. అయితే వీటిల్లో రెండు కేసుల్లో నిర్దోషిగా తేల్చగా, 12 కేసులు మూసివేయబడ్డాయని గుర్తు చేశారు. దర్యాప్తులో ఉన్న మరో నాలుగు కేసులు అత్యధికభాగం 151 సెక్షన్ కేసులే అన్నారు. దళిత, గిరిజన బలహీనవర్గాల రైతులు, మత్స్యకారుల ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా పోరాడుతున్న ప్రజలకు నాయకత్వం వహించినందునే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. నక్కపల్లి పరిసరాలలో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేసేందుకే అప్పలరాజుపై పిడి చట్టం కేసు నమోదు చేశారని స్పష్టమౌతోందన్నారు. అవుతుందన్నారు ఫార్మా లాబీ, కార్పొరేట్లు కొమ్ముగాసి, వారిని సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడడం గర్హనీయమని ఆక్షేపించారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో భూసేకరణకు అడ్డుపడేవారిపై పిడియాక్టు ప్రయోగించమనిముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకే కలెక్టర్ కనీసం అప్పలరాజుపై ఇప్పటి వరకున్న కేసుల స్వభావం పరిశీలించకుండానే సంతకం పెట్టి ఆర్డర్ జారీ చేయడం సమంజసం కాదన్నారు.

తనిఖీలు చేసుత్నా అనకాపల్లి లీగల్ మెటరాలజీ ఇన్‌స్పెక్టర్

దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలో పలు దుకాణాలపై కొలతలు, తూనికలు శాఖ అధికారులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మాంసం, చేపలు కాయగూరలు అమ్ముతున్న దుకాణాలలో కిలోకు 330 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించి ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని అనకాపల్లి కొలతలు, తూనికలశాఖ ఇన్స్పెక్టర్ వి.రామారావు తెలిపారు. అదేవిధంగా ముద్రలేని తూనిక యంత్రాలను ఉపయోగిస్తున్న మరో నలుగురు దుకాణ యజమానుల పై కేసులు నమోదు చేసామని పేర్కొన్నారు. తూనికల్లో తేడాలు ఉన్నట్లు ప్రజలు గమనించినట్లయితే 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తమను సంప్రదించవచ్చని అన్నారు. తూనికలు, కొలతలలో తేడాలు వస్తే అటువంటి వ్యాపారుల పైన చట్టరీత్య కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. వ్యాపారులు ప్రజలను మోసాలకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

పిల్లలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతంలోని సుమారు 50 మంది అనాథ పిల్లలకు అవసరమైన దుస్తులను జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర ఆదివారం పంపిణీ చేశారు. వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, అనాథ పిల్లలకు కూడా సమాజంలో గౌరవంగా బతికే హక్కు ఉందని, వారి అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పరమేష్

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి: రావికమతం: ఆర్గానిక్ వస్తువులను ఉపయోగించి ఆరోగ్యం పట్ల ప్రజలు ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని విజయవాడకు చెందిన వేస్టేజ్ కంపెనీ హెల్త్ అడ్వైజర్ పరమేష్ తెలిపారు. మండలంలో కవగుంట సర్పంచ్ దాసర సూర్యకుమారి ఆధ్వర్యంలో ఆదివారం పలువురికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ఎటువంటి కెమికల్ లేనటువంటి ఆర్గానిక్ వస్తువులను మాత్రమే వాడాలన్నారు. ప్రత్యేకంగా ప్రకృతిలో వృక్ష సంపదతో తయారు చేసిన మందులను, నిత్యావసర సరుకులను కంపెనీ సరఫరా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వరహాలు దొర, పి.మహేష్, దాసరి వరహాలు, అప్పలనాయుడు, సూర్యనారాయణ, అప్పారావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పల్లకిలో వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడు పెద్ద పల్లకి వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను పెద్ద పల్లకి వాహనం, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషా చార్యులు, గోపాలాచార్యులు పవన్,పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న భక్తులు

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- మాడుగుల:32 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. మాడుగులలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1993-94 పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు 32 సంవత్సరాల తర్వాత ఒక్క చోటే కలిశారు. ఆదివారం ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం సమీపం వద్ద వనభోజనాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ముందుగా ఒకరిని ఒకరు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు మాట్లాడుతూ, ప్రతి ఏటా వన భోజనాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని కష్టసుఖాల్లో పాలుపంచుకుందామని తీర్మానం చేసుకున్నారు కొప్పాక రాజేష్ కుమార్ స్నేహితులకు పెన్నులు పంపిణీ చేశారు.

పనులు పరిశీలిస్తున కార్యదర్శి

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కాలువలను శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగిస్తున్నారు. పంచాయతీని శుభ్రంగా ఉంచేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని, ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

మకరజ్యోతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కరపత్రాలు ఆవిష్కస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:జనవరి 14వ తేదీ నుండి 16 వరకు మూడు రోజుల పాటు నర్సీపట్నంలోని అయ్యప్ప దేవాలయంలో మకరజ్యోతి మహోత్సవాల కరపత్రాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపధ్యంలో ఆదివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 1983లో స్థాపించబడిన నర్సీపట్నం శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవ వివరాలను ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. జనవరి 14 నుండి 16 వరకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. జనవరి 15 సాయంత్రం 5 గంటలకు కేరళ వాయిద్యాలు, భజన బృందాలతో స్వామివారి రథయాత్ర, రాత్రి 7 గంటలకు పలువురు సినీ ప్రముఖులకు సన్మానం, శ్రీగజముఖ నృత్య అకాడమీ వారిచే క్లాసికల్ డ్యాన్స్, సినీ సంగీత విభావరి జరుగుతుందని వివరించారు. 16న రాత్రి 7 గంటలకు డాన్స్ బేబీ డాన్స్ నిర్వహిస్తామన్నారు. మహోత్సవాలకు ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ దంపతులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల పక్షం.. ప్రజాశక్తి

ఎపి ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి

కేలండర్ ఆవిష్కరిస్తున్న బాబ్జి

ప్రజాశక్తి- సబ్బవరం : నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి ప్రజల పక్షాన నిలిచే పత్రిక ప్రజాశక్తి తెలుగు దినపత్రిక అని ఎపి ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి అన్నారు. ఆదివారం తన స్వగృహంలో ప్రజాశక్తి నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికా ధర్మాన్ని పాటిస్తూ నీతి, నిజాయితీలతో ప్రజాశక్తి తెలుగు దినపత్రిక పనిచేస్తుందన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై తాజా కథనాలిస్తూ, ప్రజల పక్షాన నిత్యం నిలుస్తోందని ప్రజాశక్తిదినపత్రికను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నేతలు అంగటి నానాజీ, జి. ముత్యాల నాయుడు, ప్రజాశక్తి అనకాపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి జె రమేష్‌కుమార్, రిపోర్టర్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రవరంలో ఇంటింటికీ కుళాయిలు

సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎర్రవరం గ్రామ పంచాయతీలో తాగునీటికి ఇబ్బంది లేకుండా జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మీ రాము తెలిపారు. 2023లో జలజీవన్ మిషన్ ద్వారా రూ.13.50 లక్షల నిధులు మంజూరుకాగా, గ్రామంలోని పిల్ల వారి వీధి, ఎస్సీ కాలనీలో ఇంటింటికి కుళాయి ఏర్పాటుతో స్వచ్ఛమైన తాగునీరు నేరుగా ఇళ్లకే అందుబాటులోకి వచ్చిందని.బిసి కాలనీ, కొల్లాటి వారి వీధి ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు నర్మల్ కుమార్ తమ కోటా నిధుల నుంచి ఎర్రవరం గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో మిగతా ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

150 మందికి ఉచిత హోమియో వైద్యం

రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది.హోమియో సేవలో విశేషమైన చరిత్ర ఉన్న మాస్టర్ ఐకె శతాబ్ది మహోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరానికి 150 మంది రోగులు పాల్గొని ఉచితంగా సేవలు, మందులు పొందారు.. ప్రతినెలా క్రమం తప్పకుండా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోహోమియో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు సూచించారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు సన్యాసిరావు, కార్యదర్శి రాము, క్లబ్ ట్రైనర్ బుద్ధ సత్యనారాయణ, క్లబ్ కార్యదర్శి ప్రకాశరావు, రమణాచి, సానా త్రినాధ్, రాపేటి సత్యనారాయణ అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభకు తరలిరండి

సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో జరుగనున్న నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం ఉత్సాహంగా సాగింది. గాజువాక, మల్కాపురంలో రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించారు.

ప్రజాశక్తి- రావికమతం: జనవరి 4న విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వజ్రపు సత్యవతి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత మహాసభలకు విశాఖపట్నం వేదిక కానుందని, మొదటిసారి జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభల్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం చేస్తారన్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. బయటికి మేడిపండులా ఉన్న ఈ చట్టం లోపల కార్పొరేట్ కంపెనీలకి అనుకూలమైన విధానాల్ని అమలు చేస్తున్నారని, ఇప్పటివరకు ఉన్న హక్కుల్ని కాలరాస్తున్నారని, ఈనేపథ్యంలో జనవరి 4న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సభ్యులు, కార్మికులు, పలువురు పాల్గొన్నారు.

సిఐటియు నేతలు, అంగన్వాడీల ముమ్మర ప్రచారం

మునగపాక: ఈనెల 31నుంచి విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతూ మండలకేంద్రం మునగపాకలో అంగన్వాడీలు, ఇతర కార్మికులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భావం తర్వాత మొట్టమొదటి విశాఖపట్నంలో జరగనున్న చారిత్రాత్మక అఖిల భారత మహాసభల సందర్భంగా 4న కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలో యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మిక సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభలు ఈ ప్రాంతంలో జరగటం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తాయన్నారు. అనకాపల్లి జిల్లాలో కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, స్కీం వర్కర్ల సమస్యలు, వారి కనీస వేతనాల అమలుకు సిఐటియు ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. 4న మధ్యాహ్నం 2 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుండి టౌన్ కొత్త రోడ్డు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ .బ్రహ్మాజీ, జయలక్ష్మి, హేమ, సరస్వతి, లక్ష్మి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మహాసభ జయప్రదం కోరుతూ ఆదివారం పరవాడ మండల పరిషత్ కార్యాలయం నుండి సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించి 55ఏళ్ల కాలంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం మహాసభకు వేదిక కానుందని, దీన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు.కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె రమణి, ఎస్ శంకరమ్మ, దేవి, అనిత, అమ్మాజీ, నీలిమ, వరలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

గాజువాకలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతును ప్రారంభిస్తున్న నాయకులు

గాజువాక, మల్కాపురంలో కవాతు

గాజువాక : సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదంచేయాలని కోరుతూ పాత గాజువాకలో ఆదివారం కవాతు నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు జెండా ఊపి కవాతు ప్రారంభించారు. పాత గాజువాక జంక్షన్ నుండి కొత్తగాజువాక వరకు తిరిగి మరలా పాత గాజువాక వరకు రెడ్ షర్టులు, టోపీ ధరించి, సిఐటియు జెండా పట్టుకుని కవాతు నిర్వహించారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కార్మికుల హక్కులు కాపాడాలని, మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ రద్దు చేయాలని, డౌన్ డౌన్ క్యాపిటలిజం, అప్ అప్ సోషలిజం అనే నినాదాలతో కవాతు సాగింది. అనంతరం పాత గాజువాక జంక్షన్లో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, పాలకులు తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉందన్నారు. కానీ కష్టపడి పనిచేస్తున్న కార్మికులపై నెట్టే ప్రయత్నం పాలకులు చేస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వల్ల గాజువాక అభివృద్ధి చెందిందన్నారు. సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, జనవరి 4వ తేదీన నిర్వహించే బహిరంగసభకు ప్రజలు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యు.రామస్వామి, యు.ప్రసాద్, లోకేశ్వరరావు, డి.రమణ, ఎల్.బంగారునాయుడు, గొలగాని అప్పారావు, డివైఎఫ్ఐ నాయకులు రమణ, తౌడన్న, వెంకటరావు, నమ్మి రమణ పాల్గొన్నారు.

మల్కాపురంలో కవాతు

ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మల్కాపురం నుండి శ్రీహరిపురం మీదుగా కోరమండల్ గేట్ వరకు రెడ్‌షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించారు. ఈ కవాతును డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజుతో కలిసి రామన్న మాట్లాడుతూ, సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన జరిగే భారీ ర్యాలీలో రెడ్ షర్ట్ వాలంటీర్లంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడుతుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ను రద్దుచేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. జనవరి 4వ తేదీన జరిగే బహిరంగ సభలో భవిష్యత్తు పోరాటాలకు పిలుపు నివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.నరేష్, రెడ్ షర్ట్ వాలంటీర్ల కన్వీనర్ జి.నరేష్, ఎస్.వాసు, బి.శ్రీను, సిఐటియు జోన్ నాయకులు పి. పైడిరాజు, ఎన్.శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు సమీన్, దాసు, ప్రశాంత్, రామకృష్ణ, రాజేష్, ఈశ్వరరావు, రాజు, మహేంద్ర, తేజ, మోసు, నగేష్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

మధురవాడ : సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు కోరారు. మహాసభలు సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన కొమ్మాది సాయిరాం కాలనీ కూడలి వద్ద సిఐటియు జెండాను సంఘం అధ్యక్షులు కె.లక్ష్మణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, ఈ మహాసభలో భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన జరుగుతుందని తెలిపారు. మహాసభల సందర్భంగా విశాఖలో జనవరి 4న జరిగే ర్యాలీ, బహిరంగసభకు కార్మికులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, కోరాడ రమణ, సిహెచ్.లక్ష్మణరావు, ఎం.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో ప్రచారం చేస్తున్న నేతలు, అంగన్‌వాడీలు

పాతగాజువాక జంక్షన్‌లో కవాతు

మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి 69వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో సిఐటియు నాయకులు ఆదివారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎ.లోకేష్ మాట్లాడుతూ, ప్రజలు, కార్మికుల సమస్యలపై సిఐటియు పనిచేస్తుందన్నారు. శ్రామిక ఉత్సవం పేరుతో వారం రోజులు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. బిహెచ్‌పివి సిఐటియు నాయకులు ఎస్.జగన్నాధరావు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ కాకుండా సిఐటియు పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి అప్పారావు, ఎస్.తరుణ్, బాలరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవాడలో ప్రచారం చేస్తున్న నేతలు, అంగన్‌వాడీలు

రావికమతంలో ప్రచారం చేస్తున్న నాయకులు